News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

CK చంద్రకాంత్ NEWS
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :259 | ఖమ్మం | గురువారం, అక్టోబర్ 22, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# మహిళల భద్రతకు ప్రాధాన్యం



## పోలీస్ శాఖలో 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చాం

## శాంతి భద్రతలు బాగుంటేనే రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా ఉంటుంది

## అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది

**"పోలీస్ శాఖను బలోపేతం చేసేందుకు ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 4,773 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. పోలీసుశాఖలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చాం. మిగతా ఖాళీలను కూడా విడతల వారీగా భర్తీ చేస్తాం. 2028 నాటికి పోలీసుశాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తాం. పోలీసుశాఖలో ఎక్స్‌గ్రేషియాను హోదా ఆధారంగా రూ.కోటికి పైగా పెంచాం"**

హైదరాబాద్

ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నివాళులర్పించింది. వారి కుటుంబాలకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని భారీగా పెంచామని వెల్లడించారు. 2028 నాటికి పోలీస్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో జరిగిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో మహిళా భద్రత, డ్రగ్స్ గంజాయి సైబర్ నేరాల కట్టడి, కల్తీ ఆహారంపై ప్రభుత్వ చర్యలపై సీఎం వివరాలు వెల్లడించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీస్ స్మారక పరేడ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, - మిగతా3లో

# ప్రైవేటు స్కూళ్లలో పేద పిల్లకు 25 శాతం సీట్లు

- అమలు చేసేందుకు వడివడిగా అడుగులు
- నిరుపేద పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయించని నేపథ్యంలో సుప్రీం కోర్టు ఆగ్రహించింది
- ఈనేపథ్యంలో అమలుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.



హైదరాబాద్

సమాజంలోని ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లల కోసం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను కేటాయించే విషయంలో పురోగతి కనిపిస్తోంది. దశాబ్దాలు గడిచినా అనేక రాష్ట్రాలు ఈ నిబంధనను అమలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు ఇటీవల 'జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంఘం' (ఎన్‌సీపీసీఆర్)పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 27న జరగనున్న విచారణకు స్వయంగా హాజరై అమలు తీరుపై నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఎన్‌సీపీసీఆర్‌ని ఆదేశిం చింది. ఈ నేపథ్యంలో ఎన్‌సీపీసీఆర్ - మిగతా3లో



# డ్రగ్స్‌తో భావితరాలకు ముప్పు

- 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మార్చమే మా లక్ష్యం
- దిల్లీలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కేంద్ర హోంమంత్రి
- రానున్న మూడేళ్ల పాటు ఉమ్మడిగా పోరాడి మాదకద్రవ్యాల మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టాలని ఆయన పిలుపు

# పల్లె జేబుకు ధరల చిల్లు!



- తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో సెప్టెంబర్‌లో 7.21 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం
- దేశ సగటు గ్రామీణ ద్రవ్యోల్బణం 6.08 శాతంకన్నా ఎక్కువగా నమోదు
- ఉల్లి, టమాటా ధరలకు రెక్కలు.. నెల రోజుల్లోనే రెట్టింపు
- కూలీ రేట్లు పెరగక, వర్షాల్లేక పడిపోతున్న గ్రామీణుల కొనుగోలు శక్తి

హైదరాబాద్

పండుగల సమయంలో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ కుటుంబాలపై ధరల భారం రోజురోజుకూ పెరుగుతోంది. ఒకవైపు కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుంటే మరోవైపు కూలీ రేట్లు ఆ స్థాయిలో పెరగకపోవడం, వర్షాభావంతో పంటలు దెబ్బతినడం పల్లె ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీస్తున్నాయి. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంవోఎస్‌పీఐ) తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం - మిగతా3లో

# వచ్చే వారం కృష్ణా, గోదావరి యాజమాన్య బోర్డుల సమావేశం

- ఈనెల 26న కేఆర్ఎంబీ సమావేశం
- ఆ అంశాలపై చర్చ జరిగే అవకాశం
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలకు సంబంధించి వచ్చే వారంలో కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డులు సమావేశం కానున్నాయి.




హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల నీటి అంశాలకు సంబంధించి వచ్చే వారం రెండు కీలక సమావేశాలు జరగనున్నాయి. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల భేటీల్లో పలు కీలక అంశాలు చర్చకు రానున్నాయి. కృష్ణా జలాల్లో రెండు రాష్ట్రాల వాటాకు సంబంధించి ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రాజెక్టుల అనుమతులకు సంబంధించిన పరస్పర ఫిర్యాదులు, పోలవరం, టెలీమెట్రీ పరికరాల ఏర్పాటు సహా ఇతర అంశాలు - మిగతా3లో




# ఆందోళనలు హింసకు దారితీస్తాయి

- సీజేపీ నేతల కేసు విచారణలో ప్రాన్స్ అల్లర్లను ప్రస్తావించిన హైకోర్టు
- దిల్లీ హైకోర్టులో సౌరవ్ దాస్, ఆశు తోష్ రాంకకు ఊరట లభించలేదు
- ప్రత్యామ్నాయ న్యాయ మార్గాన్ని ఆశ్రయించాలని హైకోర్టు సూచించింది.

# దిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం



- అమల్లోకి వచ్చిన గ్రాఫ్ స్టేజ్1 ఆంక్షలు
- కాలుష్య నియంత్రణ చర్యలను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు
- దిల్లీ-ఎన్‌సీఆర్ అంతటా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) తొలి దశ అమలు చేశారు.

# పల్లె జేబుకు ధరల చిల్లు!

-మొదటిపేజీ తరువాయి

సెపటటంబర్‌లో తెలంగాణలో రిటైల్ ద్రవ్యోల్బణం 6.64 శాతానికి చేరింది. ఆగస్టులో ఇది 6.27 శాతంగా ఉంది. ఈ ఏడాదిలో రాష్ట్రంలో ఇదే అత్యధికం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 7.21 శాతంగా నమోదవగా పట్టణ ప్రాంతాల్లో 6.21 శాతంగా ఉంది. దేశవ్యాప్తంగా గ్రామీణ ద్రవ్యోల్బణం 6.08 శాతంగా ఉంటే రాష్ట్రంలోని పల్లెల్లో అంతకంటే ఒక శాతానికిపైగా ఎక్కువగా ఉండటం గమనార్హం. దేశవ్యాప్తంగా సెపట?టంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి చేరింది. ఇది 23 నెలల గరిష్ఠ స్థాయి. ఆహార ద్రవ్యోల్బణం ఆగస్టులో 5.97 శాతం ఉండగా సెపట?టంబర్‌లో 7.74 శాతానికి ఎగబాకింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ద్రవ్యోల్బణం 8.06 శాతానికి చేరింది. దేశవ్యాప్తంగా ఉల్లి ధరలు గతేడాదితో పోలిస్తే 108 శాతం పెరిగాయి. పట్టణ కుటుంబాలతో పోలిస్తే గ్రామీణ కుటుంబాలు తమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని ఆహారానికే ఖర్చు చేస్తాయి. దీంతో ఆహార ధరల పెరుగుదల ప్రభావం పల్లెలపైనే ఎక్కువగా పడుతోంది.



### కూలీ పెరగలేదు.. ఖర్చు పెరిగింది

ధరలు పెరుగుతున్న స్థాయిలో గ్రామీణ కూలీల వేతనాలు పెరగడం లేదు. కేంద్ర కార్మిక బ్యూరో గణాంకాల ప్రకారం ఏప్రిల్--జూన్ మధ్య పురుషుల కూలీ రేట్లు 16 శాతానికి పైగా, మహిళల కూలీ 21 శాతం మేర పెరగగా, జూలై--ఆగస్టులో ఆ వృద్ధి పురుషులకు 3 శాతానికి, మహిళలకు 4 శాతం లోపునకు పడిపోయింది. ద్రవ్యోల్బణాన్ని లెక్కలోకి తీసుకుంటే వ్యవసాయ కూలీల వాస్తవ వేతనాలు ఆగస్టులో 1.9 శాతం, వ్యవసాయేతర కూలీల వాస్తవ వేతనాలు 2.1 శాతం తగ్గాయి. అంటే కూలీకి వచ్చే డబ్బుతో గతేడాది కొన్నన్ని సరుకులు కూడా ఇప్పుడు కొనలేని పరిస్థితి. ఉపాధి హామీ పథకం స్థానంలో వచ్చిన కొత్త పథకం వీబీజీ రామ్‌జీ కింద రాష్ట్రంలో రోజువారీ కూలీని జూలై 1 నుంచి రూ. 308గా కేంద్రం నిర్ణయించింది. అయితే కొత్త పథకం అమలులో ప్రారంభ ఇబ్బందుల కారణంగా పనిదినాలు గతంతో పోలిస్తే తగ్గాయన్న విమర్శలు వస్తున్నాయి. వ్యవసాయ పనులు లేని సీజన్‌లో ఉపాధి పనులే ఆధారమైన కూలీ కుటుంబాలపై ఇది మరింత భారం మోపుతోంది.

### కరువుతో రైతుల చేతిలో డబ్బేది?

గ్రామీణ కొనుగోలు శక్తికి మూలమైన వ్యవసాయ ఆదాయాన్ని కరువు దెబ్బతీస్తోంది. రాష్ట్రంలోని 621 మండలాలకుగాను 315 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే కేంద్రానికి నివేదించారు. రాష్ట్రంలో 17 శాతం లోటు వర్షపాతం నమోదవగా ఆదిలాబాద్ జిల్లాలో లోటు 35 శాతానికి చేరింది. జిల్లాలోని 20 మండలాల్లో ఒక్కటి మినహా అన్నింటిలోనూ 24 నుంచి 45 శాతం లోటు నమోదైంది.
పత్తి, సోయాబీన్, కంది పంటలు ఎండిపోతుండటంతో పెట్టుబడుల కోసం బ్యాంకులు, ప్రైవేటు వ్యాపారుల వద్ద తెచ్చిన అప్పులు తీర్చలేక ఆ జిల్లాలోనే ఈ నెలలో ఐదుగురు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. దిగుబడులు తగ్గితే రైతుల చేతికి వచ్చే డబ్బు తగ్గి ఆ ప్రభావం గ్రామాల్లోని దుకాణాలు, వాహన షోరూంల వరకు విస్తరిస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దసరా, దీపావళి పండుగలు, ఖరీఫ్ పంట చేతికి రావడంతో సమీప భవిష్యత్తులో గ్రామీణ డిమాండ్‌కు కొంత ఊతం లభించవచ్చని.. అయితే పండుగల సందడి ముగిశాక అసలు పరిస్థితి బయటపడుతుందని అంటున్నారు.

### కూరగాయల ధరలు కుతకుత

రాష్ట్రంలో ఉల్లి, టమాటా ధరలు సామాన్యుడికి కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. నెల క్రితం కిలో రూ. 30 ఉన్న ఉల్లి ధర బహిరంగ మార్కెట్‌లో ఇప్పుడు రూ. 55 నుంచి రూ. 70 వరకు పలుకుతోంది. రైతుబజార్లలో కిలో రూ. 40 నుంచి రూ. 50కి విక్రయిస్తున్నారు. మలక్‌పేట హోల్‌సేల్ మార్కెట్‌లో ఆదివారం క్వింటాల్ ఉల్లి కనిష్ఠంగా రూ. 3,600, గరిష్ఠంగా రూ. 4,600 పలికింది. రెండు వారాల క్రితం రోడ్డు పక్కన కిలో రూ. 20కి దొరికిన టమాటా ఇప్పుడు రూ. 50కి చేరింది. సూపర్ మార్కెట్లలో రూ. 60 వరకు అమ్ముతున్నారు.
వంకాయ, బెండ, పచ్చిమిర్చి, కాకర, బీర వంటి కూరగాయలన్నీ కిలో రూ. 60 దాటాయి. కూకట్‌పల్లి రైతుబజార్‌లో అల్లం కిలో రూ. 120, వెల్లుల్లి రూ. 260, ఎండుమిర్చి రూ. 280, చింతపండు రూ. 160 పలుకుతున్నాయి. ధరల దెబ్బకు గతంలో వారానికి మూడు నాలుగు కిలోల ఉల్లి కొనే కుటుంబాలు ఇప్పుడు కిలోతోనే సరిపెట్టుకుంటున్నాయి. మహారాష్ట్ర, కర్నూలు నుంచి రావాల్సిన ఉల్లి సరఫరా తగ్గడమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

# మహిళల భద్రతకు ప్రాధాన్యం

-మొదటిపేజీ తరువాయి

డీజీపీ సీవీ ఆనంద్‌తోపాటు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం వారి సేవలను స్మరించుకుంటూ రూపొందించిన 'అమరులు వారు' పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అమరులకు నివాళి అర్పించిన అనంతరం ప్రసంగించిన సీఎం, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం భావోద్వేగంతో కూడిన రోజని పేర్కొన్నారు. సమాజం కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీసుల సేవలను మరువలేమన్నారు. అమరుల కుటుంబాల్లో ఏర్పడిన లోటును ఎవరూ భర్తీ చేయలేరని అయితే వారి కుటుంబాలు ఒంటరివి కావని, తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ, సమాజం అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం వెల్లడించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని భారీగా పెంచినట్లు తెలిపారు. కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు కోటి రూపాయలు, ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్లకు కోటి 25 లక్షలు, డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు కోటి 50 లక్షల రూపాయలు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రెండు కోట్ల రూపాయల పరిహారం అందించేలా నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవమని సీఎం స్పష్టం చేశారు. హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం



అందిస్తున్న ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను పది లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత ముఖ్యమని సీఎం పేర్కొన్నారు.

### మహిళల భద్రతకు ప్రాధాన్యం

పోలీస్ శాఖను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మరో ఐదు వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టామని, 2028 నాటికి పోలీస్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించామని వెల్లడించారు. ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించడం ద్వారా వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించే ప్రయత్నం చేశామన్నారు. హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు పోలీసు సిబ్బంది పిల్లలకు విద్యావకాశాలు కల్పించేందుకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. సైబర్ నేరాలు, డ్రగ్స్, కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపి మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు.

### డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ సేవలు భేష్

యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ ఫోర్స్ పనితీరును, డీజీపీని అభినందించారు. కల్తీ ఆహారాన్ని అరికట్టేందుకు టీజీ సేఫ్ వ్యవస్థను తీసుకొచ్చామని వెల్లడించారు. మహిళల భద్రతకు షీ టీమ్స్ సేవలను కొనసాగిస్తూ మరిన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించాలని, బాధితులకు న్యాయం అందించడంలో జాప్యం జరగకూడదని సీఎం సూచించారు. మహిళల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు.

# తాగునీటి కోసం వెయ్యి క్యూసెక్కుల నీటి విడుదల

పాలమూరు-రంగారెడ్డి-నార్లాపూర్ నుంచి ఎల్లూరు జలాశయానికి మంత్రి జూపల్లి కృష్ణారావు నీరు విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 ఏళ్లు కాలయాపన చేసి మతి లేకుండా మాట్లాడుతున్నారని, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు నీటిని ముందుకు తీసుకెళ్లండంటూ బీఆర్ఎస్ నేతలకు జూపల్లి కృష్ణారావు సవాల్? విసిరారు.

### లక్ష ఎకరాలకు అదనంగా నీటిని ఇస్తున్నాం

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు సమీపంలోని మిషన్ భగీరథ అదనంగా " రా" వాటర్ పంపింగ్ సిస్టంను మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. మిషన్ భగీరథ, పీఆర్ఎల్ఐ, ఎంజీకెఎల్ఐ ప్రాజెక్టుల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. పీఆర్ఎల్ఐ అంజనగిరి రిజర్వాయర్ నుంచి ఎల్లూరు సమీపంలోని ఎంజీకేఎల్ఐ ఎల్లూరు రిజర్వాయర్?కు నీటిని విడుదల చేశారు. 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఎంజీకెఎల్ఐ నుంచి లక్ష ఎకరాలకు అదనంగా నీటిని ఇస్తున్నామని, కల్వకుర్తి, నాగర్ కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి, అచ్చంపేట నియోజకవర్గాలకు తాగు, సాగునీటి ఇబ్బంది లేకుండా చేస్తున్నామని ఆయన అన్నారు. "ఎల్లూరు జలాశయానికి నీరు విడుదల చేశాం. వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఎంజీకెఎల్ఐ నుంచి లక్ష ఎకరాలకు అదనంగా



నీటిని ఇస్తున్నాం. కల్వకుర్తి, నాగర్ కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి, అచ్చంపేట్ నియోజకవర్గాలకు తాగు, సాగునీటి ఇబ్బంది లేకుండా చేస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు లేనిపోని అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు"

### వారి వల్లే రైతులకు నీటి కష్టాలు

నీటిని ముందుకు తీసుకెళ్లండి, 10 ఏళ్లు నిర్లక్ష్యంగా ఉండి ఇప్పుడు తెలివిలేని మాటలు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేతలపై మంత్రి జూపల్లి కృష్ణారావు విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం వచ్చాక పనులు ప్రారంభించామని, ఇంకా మూడు నాలుగు నెలలో పనులు పూర్తి అవుతాయని ఆయన స్పష్టం చేశారు. లేనిపోని అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన కాలువ పనులు తమ ప్రభుత్వం వచ్చాకనే ప్రారంభించడం జరిగిందని ఆయన అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన ప్రజలకు రైతులకు నీటి కష్టాలు వచ్చాయని ఆరోపించారు.

## వచ్చే వారం కృష్ణా, గోదావరి యాజమాన్య బోర్డుల సమావేశం




-మొదటిపేజీ తరువాయి

బోర్డు సమావేశాల్లో ప్రస్తావనకు రానున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలకు సంబంధించిన అంశాలు మరోమారు చర్చనీయాంశం కానున్నాయి. కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగం, రాష్ట్రాల మధ్య నీటి వాటాలు, ప్రాజెక్టుల అనుమతులు, పరస్పర ఫిర్యాదులపై చర్చించేందుకు ఈ నెలలో రెండు కీలక సమావేశాలు జరగనున్నాయి. ఈ నెల 26వ తేదీన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, 30వ తేదీన గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అధికారులు, ఇంజనీర్లు పాల్గొననున్నారు. ఇప్పటికే పలు అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమావేశాల్లో జరిగే చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీ అంశం మరోసారి కేఆర్ఎంబీ సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. రెండు రాష్ట్రాల మధ్య నీటి వాటాలపై ఇటీవల జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలోనూ ఏకాభిప్రాయం కుదరలేదు. ఈనెల 26న జరిగే బోర్డు సమావేశంలో ఈ అంశంపై ప్రధానంగా చర్చ జరగనుంది. రెండు రాష్ట్రాలు తమ వాదనలను బలంగా వినిపించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటి వరకు 66, 34 నిష్పత్తిలోనే పంపకాలు జరగాలని ఏపీ అంటోంది. తెలంగాణ మాత్రం విభేదిస్తోంది. కృష్ణా బేసిన్ అధికంగా ఉన్నందున అందుకు అనుగుణంగా కేటాయింపులు జరగాలని అంటోంది. 70, 30 నిష్పత్తిన కృష్ణా జలాలు వినియోగించుకోవాలని తెలంగాణ కోరుతోంది. రెండు రాష్ట్రాల భిన్న వాదనల నేపథ్యంలో కేఆర్ఎంబీ సమావేశంలో జరగనున్న చర్చ కీలకం కానుంది.

### ఆ అంశాలపై చర్చ జరిగే అవకాశం

ఎల్‌నినో ప్రభావం, వర్షభావ పరిస్థితులు, జలాశయాల్లో కొద్దిపాటి ప్రవాహాల నేపథ్యంలో నీటి నిర్వహణ కీలకంగా మారింది. పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అందుబాటులో ఉన్న జలాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ జలాలను జాగ్రత్తగా వినియోగించుకోవాలని త్రిసభ్య కమిటీ సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయించారు. జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భవిష్యత్తు అవసరాలు, నీటి విడుదలకు సంబంధించిన అంశాలపై సమీక్ష జరిగే అవకాశం ఉంది. సాగునీటి అవసరాలతోపాటు పట్టణాలు, గ్రామాల తాగునీటి అవసరాలను సమన్వయం చేసుకోవడం కూడా కీలకంగా మారింది. రెండు రాష్ట్రాల నీటి వినియోగం, విద్యుత్ ఉత్పత్తి అంశాలపై పరస్పరం అభ్యంతరాలు ఉన్నాయి.

### టెలిమెట్రీల ఏర్పాటుపై

గతంలో కృష్ణా బోర్డుకు ఫిర్యాదులు కూడా చేసుకున్నారు. దాంతో ప్రాజెక్టుల ద్వారా నీటి వినియోగం, ఇతర అభ్యంతరాలు కూడా చర్చకు వచ్చే అవకాశముంది. కృష్ణా, గోదావరి నదులపై నిర్మించిన, నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించి రెండు రాష్ట్రాలు ఇప్పటికే బోర్డులకు ఫిర్యాదులు చేశాయి. ప్రాజెక్టుల అనుమతులు, నీటి వినియోగం, నిబంధనల అమలు వంటి అంశాలపై పరస్పరం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. బోర్డు సమావేశాల్లో ఆయా ఫిర్యాదులను ప్రస్తావించి, సంబంధిత అంశాలపై స్పష్టత కోరే అవకాశం ఉంది. ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతుల స్థితి, బోర్డుల పరిధి, రాష్ట్రాలు పాటించాల్సిన మార్గదర్శకాలు వంటి అంశాలపై కూడా సమావేశాల్లో చర్చ జరిగే అవకాశం ఉంది. నదీ జలాల వినియోగాన్ని పర్యవేక్షించేందుకు టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు అంశం కూడా సమావేశాల్లో ప్రస్తావనకు రానుంది. గతంలో కొన్ని చోట్ల ఏర్పాటు చేసినప్పటికీ అందులో కొన్ని సరిగ్గా పనిచేయడం లేదు. వాటి స్థానంలో కొత్తగా ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయడంతో పాటు మరికొన్ని చోట్ల కూడా ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు ఉన్నాయి. దీంతో నదీ యాజమాన్య బోర్డు సమావేశాల్లో టెలీమెట్రీ పరికరాల ఏర్పాటు అంశంపై కూడా చర్చ జరగనుంది.

### నిధుల అంశంపై చర్చ జరిగే అవకాశం

కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల నిర్వహణ, బడ్జెట్‌కు సంబంధించిన అంశాలు కూడా ప్రస్తావనకు రానున్నాయి. బోర్డులకు రెండు రాష్ట్రాల నుంచి రావాల్సిన నిధుల అంశంపై చర్చ జరగనుంది. ఈనెల 30న జరిగే గోదావరి బోర్డు సమావేశంలో పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్స్ అంశం కూడా ప్రస్తావకు వచ్చే అవకాశం ఉంది. పోలవరం ప్రాజెక్టు కారణంగా ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టాలు, ముంపు ప్రభావం, సంబంధిత ప్రాంతాలపై పడే పరిణామాలపై గతంలోనే తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. అధ్యయనం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. ఆ మేరకు తగిన చర్యలు తీసుకుంటామని ప్రాజెక్టు అథారిటీ గతంలో తెలిపింది. జీఆర్ఎంబీ సమావేశంలో ఆ అంశంపై మరోమారు చర్చ జరిగే అవకాశం ఉంది. వీటితోపాటు రెండు రాష్ట్రాలకు సంబంధించిన ఇతర అంశాలు కూడా.. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశాల్లో చర్చకు రానున్నాయి.

## ప్రైవేటు స్కూళ్లలో పేద పిల్లకు 25 శాతం సీట్లు

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరగా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ దిల్లీకి వెళ్లి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను రాష్ట్రం అమలు చేస్తుందని కమిషన్‌కు హామీ ఇచ్చారు.

### వివిధ రాష్ట్రాల్లో అమలు

విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లోని ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను వెనుకబడిన వర్గాల విద్యార్థుల కోసం కేటాయించాలి. వారికి ఉచిత విద్యను అందించాలి. ఈ నిబంధన అమలుకు సంబంధించి ఈ ఏడాది జనవరిలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రవేశాల కోసం ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించడం, ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించడం, లాటరీ పద్ధతి ద్వారా సీట్లను కేటాయించడం, సమస్యల పరిష్కారానికి ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం వంటి చర్యలను కోర్టు తప్పనిసరి చేసింది. దీని అమలు పర్యవేక్షణ బాధ్యతను ఎన్?సీపీసీఆర్?కి అప్పగించింది. మహారాష్ట్ర, హర్యానా, ఉత్తర్?ప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఇప్పటికే అవసరమైన విధివిధానాలను రూపొందించి ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి.

### గత ఏడాది నామమాత్రంగా

తెలంగాణలో ఈ చట్టం అమలుకు సంబంధించి గత ఏడాది హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. దీంతో అప్రమత్తమైన విద్యాశాఖ ఈ చట్టాన్ని అమలు చేస్తామని అంగీకరించింది. 2025 జులైలో ప్రభుత్వ పాఠశాలలు లేని 96 ప్రాంతాలకు చెందిన పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేలా, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఆదేశాలు జారీ చేశారు. అయితే అధికారులు కేవలం ఉత్తర్వులు ఇచ్చి ఊరుకున్నారు. ఆ తర్వాత ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీని ఫలితంగా 2025-26, 2026-27 విద్యా సంవత్సరాల్లో కలిపి కేవలం 180 మంది పిల్లలు మాత్రమే ప్రవేశాలు పొందారని విద్యాశాఖ వర్గాల సమాచారం. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడంతో అధికారులు దీనిపై మరోసారి దృష్టి సారించారు.

## దసరా పర్వదినం సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ మాజీ ఎంపీ స్వయంబాబు రావు గారు శుభాకాంక్షలు డాక్టర్ నరేష్ జాదవ్ గారు.



**సికె.న్యూస్. ప్రతినిధి ఆదిలాబాద్:**అదిలాబాద్ జిల్లా ప్రజలకు విజయదశమి పర్వదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ దసరా పండుగ పురస్కరించుకొని అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ జిల్లా కలెక్టర్ రాజర్ష జిల్లా ఎస్పీ అఖిల్ మజాన్ గారికి మాజీ ఎంపీ సోయం బాబురావు గారికి వారి కాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు

ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాలను అందించాలని ఆయురారోగ్యాలతో శాంతి అభివృద్ధి వెల్లి విరైయాలని ఆకాంక్షించారు చెడుపై మంచి సాధించి విజయానికి అధికగా నిలిచే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరితో నూతన ఉత్సాహాన్ని సానుకూల ఆలోచనలను నింపాలని జిల్లా మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారూ

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల చైర్మన్ మల్లెపూలు నరసయ్య మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్ మాజీ డిసిసి అధ్యక్షులు పూజా రెడ్డి మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి జిల్లా అధ్యక్షులు మాజీ ఎంపీపీ కళ్యాణ్ రాజేశ్వర్ డిసిసి కార్యాలయం ఇంచార్జ్ గౌలి సంజీవ్ కుమార్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్ ఇచ్చోడ ఆత్మ కమిటీ చైర్మన్ పవడాల నారాయణ కాంక్ష మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్ తలమడుగు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి రాజారెడ్డి ఆదిలాబాద్ రూరల్ మండలం అధ్యక్షులు వెంకట్ యాదవ్ జిల్లా నాయకులు కార్యకర్తలు

## ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా విజయదశమి వేడుకలు

- 50 ఏళ్లకు పైగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు
- రామబాణంతో రావణ దహనం నిర్వహించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్



**సికె.న్యూస్. ప్రతినిధి ఆదిలాబాద్**ఆదిలాబాద్ పట్టణంలో విజయదశమి వేడుకలను సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. పట్టణంలో 50 ఏళ్లకు పైగా కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐఏఎస్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్, ఆదిలాబాద్ ఎంపీ గూడెం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం దస్నాపూర్‌లో నిర్వహించిన రావణ దహన కార్యక్రమానికి హాజరయ్యారు. దస్నాపూర్‌లో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ విజయానికి ప్రతీకగా భావించే శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయంలో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐఏఎస్ పట్టా పాస్ పుస్తకాలను, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ఆయుధాన్ని చేత పట్టి, పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐఏఎస్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మఠాధిపతి యోగానంద సరస్వతి సమక్షంలో షమీ చెట్టు పూజా కార్యక్రమాలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ రామబాణంతో రావణుడి బొమ్మను వెలిగించి రావణ దహన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐఏఎస్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ం

## పంచాయతీ సిబ్బందికి వస్త్రాలను పంపిణీ చేసిన ఆలస్యం.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**దసరా పండగ పురస్కరించుకొని నాగులవంచ గ్రామ పంచాయతీ సిబ్బందికి కాంగ్రెస్ జోనల్ కమిటీ నాయకులు ఆలస్యం బసవయ్య తన మనవడు శ్రేయన్స్ కార్తీ పుట్టినరోజు పురస్కరించుకొని నూతన వస్త్రాలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి, ఉపసర్పంచ్ అంబటి శరత్ కుమార్, వార్డ్ మెంబర్లు గువ్వల వీరదాసు, చెట్టిపోగు నరేష్, గంధం ఇందిరా, అన్నేపోగు రవి, గురజాల జయశంకర్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య, కాంగ్రెస్ నాయకులు నారగాని శ్రీనివాసరావు, అంబాల వెంకన్న, ఆలస్యం కృష్ణ కాంత్, మల్లెల వెంకన్న, కంభం శేషయ్య ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం - జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐఏఎస్.

- వధి నిర్వహణలో అసువులు బాసిన ప్రతి ఒక్క పోలీసు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.
- ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ నందు ఫ్లాగ్ డే
- ప్రస్తుత జిల్లా ప్రశాంత వాతావరణానికి కారణం ఒకప్పటి అమరవీరుల ప్రాణ త్యాగాల ఫలితమే
- సంఘవిద్రోహశక్తులతో పోరాడి అసువులు బాసిన ప్రతి ఒక్క పోలీసు కుటుంబానికి చేతులెత్తి దండం పెట్టిన జిల్లా ఎస్పీ.
- ప్రస్తుత సమాజం డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడుతోంది.
- విశిష్ట అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్ రావు.
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్.
- ఘనంగా పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించిన అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు.
- ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ నందు నిర్వహించిన స్మృతి పరేడ్.



**సికె.న్యూస్. ప్రతినిధి..ఆదిలాబాద్**

శాంతి భద్రతల పరిరక్షణ మరియు దేశ సరిహద్దు రక్షణ కోసం విది నిర్వహణలో అసువులు బాసిన పోలీసు ఫ్లాగ్ డే (అమరవీరుల సంస్మరణ దినోత్సవం) బుధవారం జిల్లాలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో గల అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నిర్వహించడం జరిగింది. అమరవీరుల స్తూపం వద్ద జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్ రావు, కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, న్యాయమూర్తి హుస్సేన్ నాయక్, అదనపు ఎస్పీ పి మౌనిక, ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, ఇతర శాఖల ఉన్నతాధికారులు పోలీసు ఉన్నతాధికారులు ముఖ్యంగా అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛాలతో స్తూపం వద్ద నివాళులర్పించడం జరిగింది. జిల్లా పోలీసు యంత్రాంగం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే సందర్భంగా భారీ ఏర్పాట్ల మధ్య అమరవీరులను మనస్ఫూర్తిగా స్మరించుకోవడం జరిగింది. దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం, దేశ రక్షణలో మరియు విధి నిర్వహణలో అసువులు బాసిన 154 మంది పోలీసు సిబ్బంది, అధికారుల పేర్లను అదనపు ఎస్పీ పరిపాలన పి మౌనిక ఐపీఎస్ చదువుతూ స్మరించుకోవడం జరిగింది. మొదటగా అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ పుష్పగుచ్ఛాలతో కలిసి స్తూపం వద్ద, అమర జ్యోతి వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సాయుధ పోలీసులు అమరవీరులకు సలామి శస్త్ర ద్వారా గౌరవ వందనాన్ని సమర్పించి, ఆయుధాలను తలకిందులుగా చేసి శోక్ శస్త్ర శ్రద్ధాంజలి ఘటించి, ద్వారా రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులను స్మరించుకున్నారు. తదుపరి అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించే దిశగా జిల్లా పరిపాలన మరియు పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తాందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐఏఎస్ మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో ఒక పోలీసు వ్యవస్థనే ఇతరుల కోసం ప్రాణాలను సైతం అర్పిస్తుందని తెలియజేశారు. పోలీసులు నిస్వార్థమైన సేవలను అందిస్తారని వారికి ప్రతి ఒక్కరూ సహకరిస్తూ నేర నియంత్రణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి సంవత్సరం అమరవీరులను స్మరించుకుంటూ వారికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేయాలని వారి కుటుంబ సభ్యులను సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేయాలని తెలియజేశారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరఫున ఎలాంటి సహాయ సహకారాలైన అందిస్తామని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో పోలీసులు చేసిన త్యాగాలను నిరంతరం స్మరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ మాట్లాడుతూ అక్టోబర్ 21న ప్రతి సంవత్సరం జరుపుకునే అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) 66 సంవత్సరాల క్రితం లడక్ సమీపంలో భారత సరిహద్దుల్లో పహారకాస్తున్న మన పోలీసు సిబ్బందిపై చైనీయులు దాడి చేశారని, ఈ ప్రదేశాన్ని హాట్ స్ప్రింగ్ గా పేర్కొంటారని,1959 అక్టోబర్ 21న ఆ సమయంలో విది నిర్వహణలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన పదిమంది సిఆర్పిఎఫ్ జవాన్ల వీరమరణం సందర్భంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా ఫ్లాగ్ డే దినోత్సవాన్ని అమరవీరుల ను స్మరించుకుంటూ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వారి సంస్మరణ ఆదిలాబాద్ జిల్లా నందు పది రోజులపాటు, ప్రజా హిత కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా నార్త్ తెలంగాణ లోని ఆదిలాబాద్ జిల్లాలో పోలీసులు సంఘవిద్రోహశక్తులతో పోరాడి చిరస్మరణీయులైన విషయం గుర్తు చేశారు. ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లా ప్రశాంత వాతావరణం లో కొనసాగడానికి అసువులు బాసిన ప్రతి ఒక్క అమరవీరుల కుటుంబ సభ్యులకు చేతులెత్తి దండం పెడుతూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నందు 50 మంది పోలీసు అధికారులు సిబ్బంది సంఘవిద్రోహశక్తులతో ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేస్తూ ఎలాంటి అవసరాలైన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రస్తుత సమాజం డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడుతుందని, దేశంలోనే తెలంగాణ పోలీసు శాఖ అన్ని రంగాల్లో ముందుంటూ దేశానికి ఆదర్శప్రాయంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు రెండవ బెటాలియన్ కమాండెంట్ బి వెంకటేశ్వర రెడ్డి, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్ర వర్ధన్, ఆదిలాబాద్ జిల్లా సర్కిల్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, రెండవ బెటాలియన్ అధికారులు, ఇతర శాఖల ఉన్నతాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సాంప్రదాయాలతో పొలంపల్లిలో దసరా వేడుకలు ఘనంగా,



**పాలపిట్ట అందాలను తిలకించడానికి ప్రజలు,**

**(సీ కే న్యూస్) చేగుంట :**చేగుంట మండలం పొలంపల్లి గ్రామంలో దసరా నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దుర్గామాత ఆలయంలో ప్రతిరోజు అమ్మవారికి అలంకారం, అభిషేకం, కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు.

**తొమ్మిది రోజుల సంప్రదాయం:**

మొదటి రోజు కలశ స్థాపనతో ప్రారంభమైన నవరాత్రులు తొమ్మిది రోజులు అమ్మవారికి తొమ్మిది అవతారాలలో అలంకరించారు. బాలా త్రిపుర సుందరి, గాయత్రీ, అన్నపూర్ణ, లలితా, మహాలక్ష్మీ, దుర్గా, సరస్వతీ అవతారాలలో భక్తులకు దర్శనమిచ్చారు.

**బతుకమ్మ, బొమ్మల కొలువు:**

మహిళలు ప్రతిరోజు సాయంత్రం బతుకమ్మలు పేర్చి, గౌరమ్మను పూజించి ఆడిపాడారు. ఇంటింటా బొమ్మల కొలువు ఏర్పాటు చేసి పిల్లలకు సంప్రదాయ విలువలు తెలిపారు.

**విజయదశమి – జమ్మి పూజ:**

పదవ రోజు విజయదశమి సందర్భంగా ఆలయంలో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు జమ్మి ఆకులను బంగారంగా భావించి ఒకరికొకరు పంచుకుని ఆలింగనం చేసుకున్నారు. శమీ పూజ చేసి ఆయుధ పూజ, వాహన పూజలు నిర్వహించారు.

**పిల్లలకు అక్షరాభ్యాసం:**

విజయదశమి పర్వదినాన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. గ్రామ పెద్దలు పిల్లల చేత ఓం నమః శివాయ అని రాయించి చదువుల తల్లి సరస్వతీ అమ్మవారి ఆశీర్వాదం అందజేశారు.

అనంతరం గ్రామంలో రావణ దహనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన దసరా పండుగను గ్రామస్తులంతా ఐక్యతతో జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు,మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డ్రైవర్లకు దసరా కానుకగా యూనిఫామ్‌లు పంపిణీ



**సికె న్యూస్ ప్రతినిధి ఇల్లందు.** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు డివిజన్ టిప్పర్ ఓనర్స్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు దసరా కానుకగా యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. బుధవారం టేకులపల్లి లారీ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరై డ్రైవర్లకు యూనిఫామ్‌లను అందజేశారు. దసరా పండుగ సందర్భంగా డ్రైవర్లను ప్రోత్సహించడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. లారీ రవాణా రంగంలో డ్రైవర్ల పాత్ర కీలకమని, వారి సేవలను గుర్తించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు కోరం సురేందర్, కోల్ కాంట్రాక్టర్ చిట్టీ బాబు, అసోసియేషన్ అధ్యక్షుడు నెలవెల్లి నరసింహారావు, ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ నాయక్, టేకులపల్లి ఎస్ఐ కె. తిరుపతి, అసోసియేషన్ కార్యదర్శి అరవ వెంకటేష్, భూక్య సర్దార్, నీరుడు సురేష్, డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు గుండాల వెంకన్న, యాకుబ్ శావలి, మదార్ తదితరులు పాల్గొన్నారు.

## పొలంపల్లి లో కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి పాదం



**(సీ కే న్యూస్) చేగుంట:**మెదక్ జిల్లా, చేగుంట మండలం, పోలంపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పాదం చేగుంట ప్రాంతం అంతా పూర్వం అడవులు, కొండల మధ్య ఉండేది. కాబట్టి అలాంటి చోట నరసింహ స్వామి సంచారం ఉండేదని స్థల పురాణం,

పొలంపల్లిలో వెలసిన నరసింహస్వామి పాదం ప్రత్యేకత స్వయంభూ పాదం ఎవరూ చెక్కలేదు. సహజంగా రాతిపై ఏర్పడింది. అందుకే దీనికి శక్తి ఎక్కువ అంటారు చేగుంట యాదగిరిగుట్ట మార్గం యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహుడికి, మెదక్ ప్రాంతానికి ఉన్న అనుబంధంలో ఈ పాదం ఒక ఆనవాలు స్వామి యాదగిరి నుంచి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఇక్కడ పాదం మోపారని పెద్దల మాట. ఇప్పటికీ అలాగే ఉంది అంటే ఎన్నో ఏళ్లుగా వర్షం, ఎండకు చెక్కు చెదరకుండా ఉందంటే అది మామూలు రాయి కాదు. పోలంపల్లికి ఇది పెద్ద వరం.

మంచి జరుగుతుంది, ఆ పాదం ఉన్న ఊరిలో పాడి పంటలు బాగుంటాయి, అంటురోగాలు, కరువు రావని నమ్మకం. చేగుంట మండలంలో పొలంపల్లి పేరు ఆ పాదం వల్లే నిలుస్తుంది.

చెడు జరగదు చెడు జరగాలంటే ఆ పాదాన్ని అవమానిస్తే, దాని మీద చెత్త వేస్తే, దాన్ని తొలగించాలని చూస్తే దానిపైన ఏదైనా ఎక్కి తొక్కిస్తే అలా చేయనంత వరకు ఎలాంటి దోషం లేదు.

చిన్న ఆలయంగా మార్చండి

ఆ పాదం చుట్టూ 4 స్తంభాలతో చిన్న మండపం లాంటిది కట్టండి. దానికి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పాదాల మండపం, పోలంపల్లి అని పేరు పెట్టలి, ప్రతి శనివారం దీపారాధన గ్రామ యువకులు, పెద్దలు కలిసి ప్రతి శనివారం సాయంత్రం అక్కడ దీపం వెలిగించి, కొబ్బరికాయ కొట్టండి. చాలు. ఇప్పటికైనా గ్రామస్తులు లక్ష్మీ నరసింహ ఆ పాదం పై శ్రద్ధ పెట్టి ఆ పాదాన్ని గ్రామానికి అనుకూలంగా చేయాలని గ్రామ ప్రజల కోరిక,

# చింతకానిలో ఘనంగా అన్నదాన మహోత్సవం.

**పాల్గొన్న సర్పంచ్ కిలారు మనోహర్ బాబు**

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని గ్రామంలో రామాలయం సెంటర్ దగ్గరలో ప్రతిష్టించిన దుర్గ మాత అమ్మవారి సమక్షంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అమ్మవారి సేవలో పాల్గొన్న భక్తులు అన్నదాన కార్యక్రమం విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు భక్తులు అమ్మవారి పూజలు నిర్వహించి అన్న ప్రసాదాన్ని సేకరించి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో చింతకాని ఏఎస్ఐ సువర్ణ బాబు, ఉప సర్పంచ్ దంపతులు కోలా ఉమారాణి నాగేశ్వరావు, బండి రమణ, మల్లెల సత్యనారాయణ, షేక్ జానీ మియా, వెన్నుబోయిన రాజు, బండి ప్రసాద్ వార్డ్ మెంబర్లు కిలారు బాబురావు, పొనుగోటి బాబు, షేక్ రహీమ్ తుల్లా, గంధసిరి లలిత, వేముల ఆకాష్, కమిటీ సభ్యులు గడ్డం వెంకటేశ్వర్లు జక్కి వీరబాబు, మేకనబోయిన రాంబాబు, పోతురాజు గోపాలరావు, కొడవకంటి మోహన్ రావు, బండి వెంకటేశ్వర్లు, కొలుకుల వెంకటేశ్వర్లు, కానగాని బుచ్చయ్య, గంధసిరి శీను, పొనుగోటి ప్రసాద్, పొనుగోటి చిన్న రత్నాకర్, బచ్చు బాబు, కూచిపూడి సతీష్, చింతల సైదులు, మరియు మనోహర్ బాబు యూత్ సభ్యులు పాల్గొన్నారు.





# చింతకాని మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కఆశీస్సులతో మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లికన్నెబోయిన గోపి యాదవ్ ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో మత్కేపల్లి ఏఎంసీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు ఖమ్మం మార్కెట్ కమిటీ ఎక్స్ వైస్ చైర్మన్ మడిపల్లి భాస్కర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొప్పుల గోవిందరావు జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్కె అబ్దుల్ జిల్లా నాయకులు కూరపాటి కిషోర్ నన్నక శ్రీనివాసరావు సర్పంచులు కిలారి మనోహర్ బాబు, లోయ ఉపేందర్ ,దూసరి నేతాజీ జోనల్ కమిటీ సభ్యులు ,అనుబంధ సంఘాల నాయకులు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ప్రశాంత వాతావరణంలో దేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలి

- పోలీస్ వారి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలిలి
- చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవుబి
- చింతకాని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి నరేష్



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని అక్టోబర్ 22-** దేవీ నవరాత్రుల సందర్భంగా నిమజ్జనాల సమయంలో డీజే కి ఎటు వంటి అనుమతులు లేవు. చట్టాన్ని అతిక్రమించి డీజే పెట్టినట్లయితే డిజె సీజ్ చేయబడును డీజే నిర్వాహకులపై చట్టరీత్యా చర్య తీసుకోబడును. ప్రశాంత వాతావరణంలో దేవి నిమజ్జనాలు చేసుకోగలరని చింతకాని సబ్ ఇన్స్పెక్టర్ జి నరేష్ గారు తెలియజేశారు. నిమజ్జనాల సమయంలో ఎటువంటి అల్లర్లు సృష్టించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోగలరు

# ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని కలిసిన నందనం నాయకులు



**సీకే న్యూస్ -- వలిగొండ మండల ప్రతినిధి బాలరాజు అక్టోబర్ 21:** యాదాద్రి భువనగిరి జిల్లా నందనం గ్రామానికి చెందిన యువకులు, మాజీ సర్పంచ్ సత్యం గౌడ్ సమక్షంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా పండుగ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం జమ్మి ఆకును అందించి దసరా పండుగ శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో నందనం గ్రామానికి సంబంధించిన పలు విషయాలను నాయకులు చర్చించారు. ఈ కార్యక్రమంలో నందనం గ్రామానికి చెందిన యువకులు, నాయకులు పాల్గొన్నారు.

# దసరా పండగ వేళ తీవ్ర విషదం

**ఎదురు ఎదురు బైకులు ఢీ ఒకరు మృతి మరొకరికి తీవ్ర గాయాలు.**



**సీకే న్యూస్ ప్రతినిధి ఇల్లందు.** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం. ఎర్రాయిగూడెం స్టేజి వద్ద మంగళవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో వర్స వీరస్వామి (38)మృతి చెందగా. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద లో బైక్ పూర్తిగా ధ్వంసమైంది. స్థానికులు మరియు పోలీసుల కథనం ప్రకారం. బోడు వైపు నుంచి వస్తున్న ఒక ద్విచక్ర వాహనం (బైక్),ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం (బైక్) ని బలంగా ఢీకొట్టింది. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో బైక్ నడుపుతున్న వ్యక్తి హెల్మెట్ ధరించకపోవడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ కి ఫోన్ చేయగా సమీపంలోని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గ మధ్యలో మరణించాడు. అని వైద్యులు తెలిపారు.

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని ఎర్రయిగూడెం. పంచాయతీ(చింతలకట్ట ) కు చెందిన వర్స. వీరస్వామి గా గుర్తించారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఎస్ఐ రాజమౌళి కేసు నమోదు చేసి. దర్యాప్తు ప్రారంభించారు.

# పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి



- 14 మంది పేకాట రాయుళ్ల అరెస్టు
- రూ.2,24,100 నగదు, 14 మొబైల్ ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- పేకాటకు స్థలం కల్పించిన జిన్నింగ్ యజమానిపై సైతం కేసు నమోదు
- అసాంఘిక కార్యకలాపాలపై 8712659973 నంబర్కు వాట్సప్ ద్వారా తెలియజేయవచ్చు.
- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం -- ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్ హెచ్చరించారు.

**సికె. న్యూస్. ప్రతినిధి..ఆదిలాబాద్**

విశ్వసనీయ సమాచారం మేరకు గత రాత్రి ఇంద్రవెల్లి మండలంలోని పాడుబడ్డ మిట్టల్ జిన్నింగ్ ప్రాంగణంలో పేకాట ఆడుతున్న స్థావరంపై ఆదిలాబాద్ టాస్క్ ఫోర్స్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని బృందం దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో పేకాట ఆడుతున్న 14 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 2,24,100 నగదు, 14 మొబైల్ ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్పీ తెలిపారు. నిందితులను విచారించగా, స్థల యజమానికి తెలిసే అక్కడ పేకాట ఆడినట్లు వెల్లడించడంతో సదరు యజమాని గోరేసేట్ పై సైతం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు.

పేకాట ఆడుతూ పట్టుబడిన 14 మంది నిందితుల వివరాలు:

1. తెహెరె గణేష్ (32) s/o శ్రీ సీతారాం, నివాసం: ఇంద్రవెల్లి గ్రామం, మండలం.
2. జాదవ్ దత్త (29) s/o శ్రీ లక్ష్మణ్, నివాసం: హనుమాన్ గల్లి, ఇంద్రవెల్లి గ్రామం, మండలం.
3. జాదవ్ సతీష్ (35) s/o శ్రీ మిహినాథ్, నివాసం: జామిని గ్రామం, జైనూర్ మండలం.
4. కేంద్రే సందీప్ (40) s/o శ్రీ రామారావు, నివాసం: జామిని గ్రామం, జైనూర్ మండలం.
5. ముప్పవరపు వంశీ (29) s/o శ్రీ పంచాలయ్య, నివాసం: రాంనగర్, ఇంద్రవెల్లి గ్రామం, మండలం.
6. కాగ్నే గైనినాథ్ (29) s/o శ్రీ విఠల్, నివాసం: ఇంద్రవెల్లి గ్రామం, మండలం.
7. సూర్యవంశీ తథాగత్ (26) s/o శ్రీ గంగాధర్, నివాసం: సత్వాజిగూడ గ్రామం, ఇంద్రవెల్లి మండలం.
8. చింతవార్ సందీప్ (38) s/o శ్రీ హనుమాండ్లు, నివాసం: ఇంద్రవెల్లి గ్రామం, మండలం.
9. ఫడ్ విశాల్ (24) s/o శ్రీ ప్రహ్లాద్, నివాసం: సాయినగర్, ఇంద్రవెల్లి గ్రామం, మండలం.
10. పాండే సంతోష్ (29) s/o శ్రీ మాధవరావు, నివాసం: బజార్ గల్లి, ఇంద్రవెల్లి గ్రామం, మండలం.
11. ఫడ్ విజయ్ (27) s/o శ్రీ ప్రకాష్, నివాసం: బజార్ గల్లి, ఇంద్రవెల్లి గ్రామం, మండలం.
12. దగ్గే సుధాకర్ (30) s/o శ్రీ నారాయణ్, నివాసం: అంజీ గ్రామం, ఇంద్రవెల్లి మండలం.
13. నాన్లన్వార్ హృదయ్ (23) s/o శ్రీ చైత్రనాని, నివాసం: సాలేవాడ (బి) గ్రామం, ఉట్నూర్ మండలం.
14. గైక్వాడ్ నారాయణరావు (49) s/o శ్రీ నర్సింగరావు, నివాసం: ఇంద్రవెల్లి గ్రామం, మండలం.

అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయండి అనే విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట, గంజాయి, అక్రమ కార్యకలాపాలు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే ప్రజలు నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని ఎఎస్పీ సూచించారు. ఇందుకోసం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ నేరుగా పర్యవేక్షించే వాట్సాప్ నంబర్ 8712659973 కు సమాచారం పంపవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారితో పాటు వాటికి సహకరించే వారిపైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్ హెచ్చరించారు.

# లక్ష్మీపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ





- క్రీడాకారులను ప్రోత్సహించిన ఉత్సాహపరచిన
- బీజేపీ కొల్లాపూర్ తాలూకా కన్వీనర్ మేకల శ్రీనివాస్ యాదవ్

**సి కే న్యూస్ కొల్లాపూర్ ప్రతినిధి:** లక్ష్మీపల్లి గ్రామీణ ప్రాంతాల్లో యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో లక్ష్మీపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను బీజేపీ పార్టీ కొల్లాపూర్ తాలూకా కన్వీనర్ మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో యువ క్రికెటర్లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన జట్లకు మేకల శ్రీనివాస్ యాదవ్ నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతిగా బ్రదర్ టీమ్‌కు రూ. 3,000, ద్వితీయ బహుమతిగా జైశ్రీరామ్ టీమ్‌కు రూ. 2,000 నగదు బహుమతులను అందించి క్రీడాకారులను అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన ప్రోత్సాహం లభిస్తే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు ఉంటాయని క్రీడాభిమానులు అభిప్రాయపడ్డారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలు, ఆరోగ్యం, సామాజిక సేవపై దృష్టి సారించాలని సూచించారు. లక్ష్మీపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందించడం పట్ల యువకులు సంతోషం వ్యక్తం చేశారు. ఇటువంటి క్రీడా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆకాంక్షించారు. గ్రామీణ యువతకు క్రీడా ప్రోత్సాహం విజేతలకు నగదు బహుమతులు అందించిన మేకల శ్రీనివాస్ యాదవ్. ఈ కార్యక్రమం ఆర్గనైజేషన్ చేసిన వారు ఇటిక్యాల శంకర్, స్వామి నాయుడు, కృష్ణమూర్తి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన లింగయ్య యాదవ్ దంపతులు.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు అక్టోబరు 20.** అరూరు: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం అరూరు గ్రామంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని దుర్గామాత అమ్మవారికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ అభివృద్ధి విరాళదాత కసిరబోయిన లింగయ్య యాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు చిరంజీవిమణినందన్, రిషిక పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామ ఉపసర్పంచి, గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ వార్డు సభ్యుల సమక్షంలో పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా లింగయ్య యాదవ్ దంపతులు అరూరు గ్రామ ప్రజలకు, వలిగొండ మండల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు.

# నేరడ గ్రామస్తుడు ఆటో డ్రైవర్ షేక్ మదర్ సాహెబ్ కుమారుడికి మెడికల్ సీటు

**సన్మానించిన నేరడ గ్రామస్తులు**



**సి,కే న్యూస్ చింతకాని ప్రతినిధి :** చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన షేక్ మదర్ సాహెబ్ కుమారుడు షేక్ హుస్సేన్ జాఫర్ కి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కన్వీనర్ కోటాలో స్వీటు లభించింది ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎస్కె హుస్సేన్ జాఫర్ కి షేక్ లభించినది ప్రభుత్వం మైనార్టీ గురుకుల కాలేజీ లో ఏంటో ఇంటర్మీడియట్ వరకు విద్యను అభ్యసించినాడు అనంతరం నీటి ఎగ్జామ్ లో 2026 లో 468 మార్కుల తో ఆల్ ఇండియా 16793 ర్యాంకు రాష్ట్ర స్థాయిలో 2.407 సాధించారు ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించారు షేక్ హుస్సేన్ జాపర్ తండ్రి మదర్సాహెబ్ ఆటో నడుపుతాడు తల్లి ఎస్కె జీరీనా ఖమ్మం డిపో ఆర్టీసీ బస్సు కండక్టర్గా విధులు నిర్వహిస్తున్నారు సామాన్య కుటుంబం జన్మించి తల్లిదండ్రులు పేదవారైనప్పటికీ కష్టపడి చదివించినారు మదర్సాయిబ్ జరీనా కుమారుని హుస్సేన్ జాపరకు మెడికల్ సీట్ వచ్చినందుకు నేరడ గ్రామస్తులు హర్షశీ తెలియజేసిన వారు నేరడ మాజీ సర్పంచ్ మంకెన్ రమేష్ గ్రామ పెద్దలు ఆలస్యం నాగేశ్వరావు ఆలస్యం నరసింహారావు చింతకాని పిఎస్సీ డైరెక్టర్ నన్న క కోటయ్య గ్రామ పెద్దలు కందిమల్ల బాబు చేవు ల వెంకటప్రసాద్ కిలారి కిరణ్ కోట పెద్ద బుచ్చాలు అల్లిక నరేష్ గోపి కనకపుడి వెంకటేశ్వర్లు చిన్న పోగు కుటుంబరావు తదితరులు పాల్గొని హర్షం తెలిపారు

# రాష్ట్ర స్థాయి ఎస్ జి ఎఫ్ అండర్ 19 రగ్బీ పోటీలకు 24 మంది ఎంపిక





**అక్టోబర్ 21 (సీ కే న్యూస్) చేగుంట :**చేగుంటలోని ఇండోర్ మల్టీ పర్పస్ స్టేడియం గ్రౌండ్ లో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 19 బాల,బాలికల రగ్బీ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా నుండి దాదాపు 56 మంది బాల,బాలికలు పాల్గొనగా అందులో నుండి మంచి ప్రతిభ చూపిన 12 మంది బాలికలు,12 బాలురను ఎంపిక చేసినట్టు మెదక్, సిద్దిపేట సంగారెడ్డి జిల్లాల ఆర్గనైజింగ్ సెక్రటరీలు నాగరాజు, సమ్మయ్య,గణపతి కోచ్ కరణం గణేష్ రవికుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.బాలికల విభాగం లో ఎంపికైన వారు గాయత్రి,దివ్య,లాస్య,సారిబ, ఎస్తేర్ రాణి,మమత,వర్ష శ్రీ,అక్షయ,నందిని,ప్రియాంక,శ్రేయ, బాలుర విభాగంలో నరేష్,ప్రభాస్,విష్ణు,పండిత్, ప్రశాంత్,కార్తీక్,పండరి,నితిన్,మణికంఠ,కార్తీక్,ప్రశాంత్ తదితరులు ఎంపికయ్యారు.ఎంపికైన వీరు ఈ నెల 23 నుండి 25 వరకు రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ లోని విఎం హోమ్ రెసిడెన్షియల్ స్కూల్ గ్రౌండ్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు.వీరి ఎంపిక పట్ల వివిధ కాలేజీల ప్రిన్సిపల్స్,పీడీ లు వివిధ పార్టీల రాజకీయ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## గంగులనాచారంలో పారిశుధ్య పనులకు శ్రీకారం

**| సర్పంచ్ మాల్కం లక్ష్మి ఆధ్వర్యంలో పనులు**



**సీకే న్యూస్ ఖమ్మం జిల్లా ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు అక్టోబర్ 22 2026:** ఏన్కూరు గంగులనాచారం గ్రామపంచాయతీ పరిధిలో రహదారులకు ఇరువైపులా పెరిగిన కంపచెట్ల తొలగింపు పనులను గ్రామ సర్పంచ్ మాల్కం లక్ష్మి ప్రారంభించారు. రహదారుల వెంట కంపచెట్లు పెరగడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉండటంతో వాటి తొలగింపు చర్యలు చేపట్టారు.గ్రామంలో రహదారుల వెంట ఉన్న కంపచెట్లను తొలగించడం ద్వారా రాకపోకలకు ఇబ్బందులు తగ్గడంతో పాటు గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అవకాశం ఉంటుందని సర్పంచ్ తెలిపారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వీరబాబు, మాజీ ఎంపీపీ ముక్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## "రేపల్లెవాడ గ్రామంరామరాజ్యంలో రాబందులు"అనే షార్ట్ ఫిల్మ్ ను స్క్రీన్ పై ప్రదర్శించారు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** ఖమ్మం జిల్లా చింతకాని మండలం రేపల్లెవాడ గ్రామం లో స్క్రీన్ పైన ప్రదర్శించారు.ఈ షార్ట్ ఫిల్మ్ కు దర్శకత్వం వహించిన దర్శకుడు కట్ట ధర్మారావు గారిని పాతర్లపాడు కళాకారులు అభినందించారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి షార్ట్ ఫిలిం ను తీసినటువంటి కళాకారుల టీమ్ ను అభినందించారు.మరుగున పడిపోతున్న కళలను
బతికిస్తున్న కళాకారులకు ధన్యవాదాలు తెలియజేశారు. అభినందన కార్యక్రమంలోరేపల్లెవాడ గ్రామస్తులు మడిపల్లి భాస్కర్ గారు,గొట్టిముక్కల వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి శ్రీనివాసరావు,గొట్టిముక్కులకృష్ణమూర్తి వాకర్లపాడు సాంఘిక నాటక నాటక కళాకారులు పాల్గొన్నారు.

# చేగుంటలో సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన సదస్సు



**ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి ఆదేశాలు మేరకు**

**అక్టోబర్ 21 (సీ కే న్యూస్) చేగుంట :**చేగుంట మండలంలోని బోనాల రోడ్డు, జీవిక కంపెనీ సమీపంలో యువతకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.
ఈ కార్యక్రమాన్ని చేగుంట పోలీస్ స్టేషన్ ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి, ఆదేశాల మేరకు, ఏఎస్ఐ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యువత సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తగా ఉండాలని, తెలియని వ్యక్తుల నుండి వచ్చే లింకులు క్లిక్ చేయవద్దని, ఓటిపి మోసాలు, ఓఎల్ఎక్స్ మోసాలు, లోన్ యాప్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కి డయల్ చేయాలని లేదా లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ పిసిఎస్ మహేష్, సిద్ధప్ప, అనంతసాగర్ సర్పంచ్ శ్రీధర్, యువత పాల్గొన్నారు

## పొలంపల్లిలో శిథిలావస్థలో బస్ స్టాండ్,అధికారులు పట్టించుకోరా,



**(సీ కే న్యూస్) చేగుంట :**చేగుంట మండలం పొలంపల్లి గ్రామ శివారులోని బస్ స్టాండ్ శిథిలావస్థకు చేరి ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. కోట్ల రూపాయలు అభివృద్ధి పేరుతో ఖర్చు చేస్తున్నామని చెప్పుకునే రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు కనీసం బస్ స్టాండ్ ను కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇంటింటికి తిరిగే నాయకులు, గెలిచిన తర్వాత గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని, బస్ స్టాండ్ పరిస్థితే ఇందుకు నిదర్శనమని ప్రయాణికులు మండిపడుతున్నారు. విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఎండలో, వానలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రయాణికుల గోడు ఎవరు వింటారు? అధికారులు వెంటనే స్పందించి బస్ స్టాండ్ ను పునర్నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## గూడూరు దుర్గామాత మండపం వద్ద ముక్కుపుడక శ్రీ చక్రం వేలం పాటలో గుండు పార్వతమ్మ అంజయ్య కైవాసం చేసుకున్న కుటుంబం

**భక్తిశ్రద్ధలతో పాల్గొన్న గ్రామస్థులు,**



**షాద్ నగర్ నియోజకవర్గ కొత్తూరు సి కె న్యూస్ ప్రతినిధి,అక్టోబర్ 21:** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం గూడూరు గ్రామంలో దసరా ఉత్సవాలు భక్తిపారవశ్యంతో అంగరంగ వైభవంగా కొనసాగాయి గ్రామంలోని దుర్గామాత మండపం వద్ద అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ముక్కుపుడక శ్రీ చక్రం వేలం పాటలో గుండు పార్వతమ్మ అంజయ్య కుటుంబ సభ్యులు రూ.2,65,555 విలువైన బహుమతిని కైవసం చేసుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు ఈ వేలం పాటలో వారికి బహుమతి దక్కడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేయగా గ్రామంలో పండుగ సందడి మరింత పెరిగింది దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముక్కుపుడక శ్రీ చక్రం వేలం పాటలో గ్రామానికి చెందిన భక్తులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారిపై తమకున్న భక్తిని చాటుకున్నారు వేలం పాట ఉత్కంఠభరితంగా సాగగా చివరకు ఇది రెండవసారి గుండు పార్వతమ్మ అంజయ్య కుటుంబ సభ్యులకు రూ.2,65,555 విలువైన బహుమతి దక్కింది.
అమ్మవారి ఆశీస్సులతోనే ఈ అదృష్టం
శ్రీ చక్రం వేలం పాటలో బహుమతి దక్కడం పట్ల గుండు పార్వతమ్మ అంజయ్య కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు దుర్గామాత ఆశీస్సులు అమ్మవారి కృప తమ కుటుంబంపై ఉండటం వల్లే ఈ అదృష్టం కలిగిందని తెలిపారు అమ్మవారి పట్ల తమకున్న భక్తి విశ్వాసాలను వ్యక్తం చేస్తూ ఈ విజయాన్ని అమ్మవారి అనుగ్రహంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు బహుమతి దక్కడంతో కుటుంబ సభ్యులు బంధుమిత్రుల్లో సంతోషం వెల్లివిరిసింది.
విజేత కుటుంబానికి అభినందనలు
వేలం పాటలో బహుమతిని కైవసం చేసుకున్న గుండు పార్వతమ్మ అంజయ్య కుటుంబ సభ్యులను దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు అభినందించారు విజేత కుటుంబానికి రూ.2,65,555 నగదు చెక్కును అందజేసి శుభాకాంక్షలు తెలిపారు దసరా ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఆనందంగా ఉందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో

# పులి సంచారం అనేది అవాస్తవం,

**అటవీశాఖ శాఖ అధికారుల బృందం వెల్లడి,**

**(సీ కే న్యూస్) చేగుంట:** పులి సంచరిస్తున్న సమాచారంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు, వివరాల ప్రకారం చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్న సమాచారం తెలవడంతో వెంటనే సర్పంచ్ ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందజేయగా వారు వచ్చి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న, ఫోటోలను పరిశీలించగా పులి ఫోటో రెడ్డిపల్లి ఫారెస్ట్ లోనిది కాదని ఫారెస్ట్ అధికారులు తెలిపారు, ఈ సమాచారం గ్రామ సర్పంచ్ కి తెలపడంతో



రెడ్డిపల్లి అటవీ ప్రాంతంలోనిధి కాదని సంచరిస్తున్న పులి అన వల్ల కోసం పరిశీలించగా అది అవాస్తవం అని నిర్ధారణ కావడంతో, గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకునారు,

## ఆలస్యం రవి నరసయ్యల కుటుంబాలను పరామర్శించిన సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు పోతునేని



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ మధిర డివిజన్ కమిటీ సభ్యులు ఆలస్యం రవి నరసయ్య తండ్రి ఆలస్యం బసవయ్య అనారోగ్యంతో మృతి చెందారు వారి కుటుంబాలను బుధవారం సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్ రావు తో కలిసి మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు పరామర్శించారు. వారు మాట్లాడుతూ ఆలస్యం అచ్చయ్య శివం పార్టీ బలోపేతానికి ఎంతో చేశారని పార్టీకి ఎంతో నిబద్ధత కార్యకర్తలాగా పనిచేశారని వారు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు పార్టీ కార్యక్రమాలలో ముందుండి నడిపించేవాడని కొని ఆడారు ఆయన కుమారులు ఆలస్యం రవి, నరసయ్య. తండ్రి అడుగుజాడల్లోని నడుస్తూ పార్టీ కార్యక్రమాలు ఏమి ఉన్నతన భుజస్కశీదాల మీద వేసుకొని నడిపించాడని పార్టీని ఎంతో బలోపేతం చేస్తూ కార్యకర్తలకు అండగాలనిపిస్తూ ఉండేవాడని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దేశ బోయిన ఉపేందర్ తోటకూరి వెంకట నరసయ్య కందరమైన కొండలరావు రౌతు అప్పారావు బండి నరేష్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లేళ్ల కోటయ్య దశదిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**సీకే న్యూస్ ఖమ్మం జిల్లా ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు అక్టోబర్ 22 2026:** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన లేళ్ల కోటయ్య దశదిన కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా లేళ్ల కోటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఆప్తుడిని కోల్పోవడం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేడ ధర్మారావు తదితరులు పాల్గొని లేళ్ల కోటయ్యకు నివాళులర్పించారు.

## డాక్టర్ కూరపాటి మురళి కుటుంబ సభ్యుల దాతృత్వం సమాజానికి స్ఫూర్తిదాయకం

**నాగలవంచ గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యులు డాక్టర్ కూరపాటి మురళి**



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**గ్రామ పంచాయతీ సిబ్బందిపై ప్రేమాభిమానాలు చాటుతూ... మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న సేవా కుటుంబం!లి సేవ చేయడానికి పదవులు అవసరం లేదు... సమాజం పట్ల బాధ్యత, మనుషుల పట్ల ప్రేమ, ఇతరుల కష్టాన్ని గుర్తించే మంచి మనసు ఉంటే చాలు. అలాంటి మానవతా విలువలకు ప్రతిరూపంగా నిలుస్తున్నారు . దసరా పండుగను పురస్కరించుకొని గ్రామ పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేస్తూ, వారి సేవలను గుర్తించి, వారికి గౌరవాన్ని అందించడం ద్వారా తమ కుటుంబ దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారులి.

## దుర్గామాతను దర్శించుకున్న అయ్యం గార్ల సత్యనారాయణ,

**వారి సేవలు మరువలేనివి, గ్రామ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర,**



**అక్టోబర్ 21 (సీ కే న్యూస్) చేగుంట :**చేగుంట మండల కేంద్రంలో చందాయిపేట గ్రామంలోని, దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని ప్రముఖ ప్రజా నాయకులు, సామాజిక సేవకులు అయ్యం గార్ల సత్యనారాయణ దుర్గామాతనుదర్శించుకున్నారు,
అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలంతా సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ సత్యనారాయణ సేవలు మరువలేనివి,చందాయిపేట గ్రామంలో గత ఎన్నో సంవత్సరాలుగా పేదలకు, యువతకు అండగా నిలుస్తూ, దేవాలయాల అభివృద్ధికి, సామాజిక సేవా కార్యక్రమాలకు ఆయన చేస్తున్న కృషి మరువలేనిదని స్థానిక ప్రజలు, యువత కొనియాడుతున్నారు. ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ ముందుకు వచ్చే గొప్ప మనస్తత్వం ఉన్న నాయకుడు సత్యనారాయణ గారని, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు.
ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ తుల్జా భవాని ప్రత్యేక పూజ నిర్వహించిన గూడూరు మాజీ సర్పంచ్ రాందాస్ నాయక్

- కొత్తూరు మండలం, మక్తగూడ గ్రామ పంచాయతీ పరిధిలో పెద్ద గుట్ట తాండాలో ఘనంగా తుల్జా భవానీ పూజలు
- ప్రత్యేక పూజలు పాల్గొన్న కొత్తూరు మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి



**షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు పీకే న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 21:**రంగారెడ్డి జిల్లా, కొత్తూరు మండలం, మక్తగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దగుట్ట తండాలో తుల్జా భవాని అమ్మవారి పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి. తండాలోని ప్రతి ఇంటి నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.
తండా వాసుల ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా తుల్జా భవాని అమ్మవారి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించారు. యువకులు డప్పు వాయిద్యాలతో, భజనలతో తండా అంతా మారుమోగేలా చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రాందాస్ మాట్లాడుతూ మా తండాలో తుల్జా భవాని అమ్మవారిని కొలిచినప్పటి నుండి మా తండా ఎంతో అభివృద్ధి చెందింది. ఈ అమ్మవారిని నమ్మి కొలవడం వలన మా పంటలు బాగా పండుతాయి, వర్షాలు సకాలంలో కురుస్తాయి. అంతేకాకుండా తండా వాసులందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటారు. అమ్మవారి దయ వలన మాకు ఎలాంటి కష్టాలు రావు. ప్రతి సంవత్సరం ఇలాగే ఘనంగా పూజలు చేస్తాము అని అన్నారు.
పూజా కార్యక్రమ వివరాలు:
ఉదయం నుండి అమ్మవారికి అభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు.
మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తండా వాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.
సాయంత్రం బతుకమ్మ, కోలాటం, తీజ్ నృత్యాలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో తండా నాయకులు, పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజల అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పేదలకు న్యాయం చేయాలి

- ఖమ్మం కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ మిత్రపక్షాల ధర్నా



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో గ్రామ సర్పంచులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని తిరుమలాపురం గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు చాపలమడుగు వీరబాబు డిమాండ్ చేశారు. ఈ అంశంపై బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ మిత్రపక్షాల ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.గ్రామస్థాయిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియలో సర్పంచుల భాగస్వామ్యం ఉండాలని, రాజకీయ పక్షపాతానికి తావులేకుండా పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేయాలని ఆయన కోరారు. గ్రామ ప్రజలకు సంబంధించిన సంక్షేమ పథకాల అమలులో ఎన్నికైన ప్రజాప్రతినిధుల పాత్రను విస్మరించకూడదని పేర్కొన్నారు.

**ధర్నాకు తరలిరావాలని పిలుపు**

అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 22, గురువారం ఉదయం 10 గంటలకు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చాపలమడుగు వీరబాబు పిలుపునిచ్చారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గాభవాని అమ్మవారి శోభాయాత్ర

తొమ్మిది రోజుల పాటు వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



**సికే న్యూస్ మెదక్ జిల్లా కొల్చారం, అక్టోబర్ 21 :**కొల్చారం మండలవ్యాప్తంగా దుర్గాభవాని నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి శోభాయాత్రను భక్తులు ఘనంగా నిర్వహించారు.
ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య శోభాయాత్ర భక్తిమయ వాతావరణంలో కొనసాగింది.
దుర్గాభవాని అమ్మవారి కృపాకటాక్షాలతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్రతో మండలవ్యాప్తంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది.
ఈ కార్యక్రమంలో దుర్గాభవాని కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇల్లందులో జనసందోహం నడుమ అంగరంగ వైభవంగా విజయదశమి వేడుకలు



**సికె న్యూస్ ప్రతినిధి ఇల్లందు.** ఇల్లెందులో మంగళవారం అర్ధరాత్రి వరకు నిర్వహించిన దసరా వేడుకలు వైభవంగా సాగాయి. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి ఉత్సవాల్లో పాల్గొనిఉబ్ ప్రజలను ఉద్దేశించి
ఇల్లెందులో దసరా వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తూ వేలాదిమంది పాల్గొనడం అభినందనీయమని మంత్రి పొంగులేటి అన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాల్లో భాగస్వాములు కావడం పండుగ ప్రత్యేకతను చాటుతోందన్నారు. కళాకారుల ఆటపాటలు, ప్రదర్శనలు, వారి ఉత్సాహం చూస్తుంటే ఎంతో ముచ్చటేస్తోందని కొనియాడారు.
ధర్మానికి విజయదశమి ప్రతీక
చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ పర్వదినం సత్యం, ధర్మం పట్ల నిబద్ధతతో ముందుకు సాగాలనే సందేశాన్ని అందిస్తుందన్నారు. పండుగలు మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడటంతోపాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.

## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ను అభయాంజనేయ స్వామి దేవాలయం కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంకు ఆహ్వానించిన కర్నాటి రామారావు...



**మధిర అక్టోబర్ 21(సికె న్యూస్)ప్రతినిధి.**మధిర పట్టణంలోని బంజర కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న దసరా పండుగ సెమి పూజ కార్యక్రమం కు హాజరైన తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. కార్యక్రమానంతరం మల్లు భట్టి విక్రమార్కును కలసిన కృష్ణాపురం గ్రామ మాజీ సర్పంచ్ ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు త్వరలో కృష్ణాపురం గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవాలయం నూతన అధ్యక్ష, పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆహ్వానించారు. ఆహ్వానంపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం వివరాలను తెలుసుకుని, ఆహ్వానించిన కర్నాటి రామారావుతో మాట్లాడారు. దేవాలయ కార్యక్రమం విజయవంతంగా జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్య నాగేశ్వరరావు,
ఉపసర్పంచ్ కొత్తపల్లి నరసింహారావు, కర్నాటి శ్రీనివాసరావు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం




**మధిరఅక్టోబర్ 21(సికె న్యూస్)ప్రతినిధి.**మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు డీ-క్లస్టర్ కేంద్రాన్ని మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన పట్టభద్రులు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకునేందుకు ఎమ్మెల్సీ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు.
ఓటరు నమోదుకు ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, డిగ్రీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో తదితర అవసరమైన పత్రాలతో నమోదు కేంద్రానికి రావాలని సూచించారు.
ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నమోదు కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉంటారని, నవంబర్ 6, 2026 ఓటరు నమోదుకు చివరి తేదీ అని తెలిపారుపట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా తమ ఓటును నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య బలోపేతంలో ప్రతి పట్టభద్రుడి భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురం శెట్టి కిషోర్సర్పంచులు సంపసాల రామకృష్ణ, పగిడిపల్లి శ్రీనివాసరావు, మువ్వా వెంకయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరు మండలం గూడూరు గ్రామంలో అంగరంగ వైభవంగా దుర్గామాత నిమజ్జనం



**షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు సి కె న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 21 :**రంగారెడ్డి జిల్లా, కొత్తూరు మండలం, గూడూరు గ్రామంలో దుర్గామాత నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా, భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.
గత తొమ్మిది రోజులుగా గూడూరు గ్రామంలో భక్తి శ్రద్ధలతో దుర్గామాతను పూజించిన భక్తులు, నేడు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని గంగమ్మ ఒడిలో చేర్చారు.
ఈ నిమజ్జన శోభయాత్రలో మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు. మహిళలంతా సంప్రదాయ దుస్తులు ధరించి, దాండియా ఆడుతూ, కోలాటం వేస్తూ, భక్తి పాటలు పాడుతూ శోభయాత్రను మరింత శోభాయమానంగా మార్చారు. యువకులు డప్పు వాయిద్యాలతో, డీజే పాటలతో ఉత్సాహంగా నృత్యాలు చేశారు.
ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలు:బి
ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించారు. తాగునీటి వసతి, ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు. పోలీసుల సహకారంతో శోభయాత్ర ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా ముగిసింది.
గూడూరు చెరువు వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. భక్తులు అమ్మవారికి వీడ్కోలు పలుకుతూ, మళ్లీ వచ్చే ఏడాది రావాలని కోరుకున్నారు.
ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తుక్కాపూర్ అభివృద్ధికి ఎమ్మెల్యే భరోసా

గ్రామ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ ఆంజనేయులు వినతి



**సి కె న్యూస్ మెదక్ జిల్లా కొల్చారం, అక్టోబర్ 22**
మెదక్ జిల్లా కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామ అభివృద్ధికి సహకరించాలని గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు తెలిపారు.
గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు సర్పంచ్ తెలిపారు. తుక్కాపూర్ సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ వెల్లడించారు. సర్పంచ్ తో పాటు ఉప సర్పంచ్ ఆరె రవీందర్ ,వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎం ఈ ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా గద్దల వెంకటేశ్వర్లు (జి.వి) నియామకం.

- ఉత్తర్వులు జారీ చేసిన ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం ఈ ఎఫ్ జాతీయ గౌరవాధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ.



**మధిర అక్టోబర్ 21సికెన్యూస్)ప్రతినిధి.**ఎం ఈ ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా మధిరకు చెందిన గద్దల వెంకటేశ్వర్లు (జి.వి) నియమితులైనారు. ఎంప్లాయిస్ ఫెడరేషన్ కు అందించిన సేవలకు గాను ఆయనకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది.గద్దల వెంకటేశ్వర్లు, ఎం ఆర్ పి ఎస్ నాయకత్వంలో జరుగుతున్న ఉద్యమాలలో కీలక బాధ్యతలు పోషిస్తూ, సామాజిక అభ్యున్నతికి, సాధికారత కోసం అందిస్తున్న సేవలను గుర్తించిన జాతీయ గౌరవాధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ, గద్దల వెంకటేశ్వర్లును ఎం ఈ ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు.పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ తరఫున ఎం ఈ ఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మంద దేవేందర్ ప్రసాద్, ఎం ఈ ఎఫ్ ఫౌండర్ గుండెపాక నరసయ్య గద్దల వెంకటేశ్వర్లుకు నియామక పత్రాన్ని అందించారు. వెంకటేశ్వర్లు ను శాలువా మెమొంటో తో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎం ఈ ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జె. పుష్ప రాజ్, ఎం. ప్రసాద్, జి. బాబు, ఎన్.సుధాకర్, రాష్ట్ర కోశాధికారిడ జిల్లా పూర్వ అధ్యక్షులు పట్టా వెంకటేశ్వర్లు, కర్ల గంటి శ్రీను తదితరులు పాల్గొని గద్దల వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా గద్దల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనకు ఈ అవకాశాన్ని కలిగించిన పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ కు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు.

## సంపాదకీయం

# భయపెడుతున్న పందెం!?

కృత్రిమ మేధ మానవ మనుగడకే ముప్పు కావొచ్చని హెచ్చరిస్తున్న సంస్థలే, ఆ సాంకేతికతపై లక్షల కోట్లు కుమ్మరిస్తున్నాయి. ఇది నిజమైన భయమా? లేక పెట్టుబడులను ఆకర్షించే వ్యూహమా? అన్న చర్చ బిగుస్తోంది. విమర్శకులు దీన్ని "భయమే అమ్మకపు సరుకు" అంటుంటే, పోటీ ఉచ్చులో చిక్కుకున్న సంస్థలు ఆగలేకపోతున్నాయని మరికొందరి వాదన. ఎవరి వాదన నిజమైనా, ఇంతటి శక్తిని కొద్ది ప్రైవేట్ సంస్థల చేతుల్లోనే వదిలేయడం సరైనదేనా? అన్నది అసలు ప్రశ్న. నిజానికి -ఇది ఏఐ ప్రపంచానికి ఒక విచిత్రమైన వైరుధ్యం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో యాంత్రోపిక్ సంస్థను వదిలిన పరిశోధకుడు జాకబ్ కాక్సన్, ఈ పోటీ "మన ప్రాణాలతో చెలగాట"మని బహిరంగంగా ప్రకటించారు. ఆ సంస్థలోని అలైన్‌మెంట్ సైన్స్ విభాగాధిపతి ఎవాన్ హబింగర్, దశాబ్దంలో మానవ వినాశనానికి 10 శాతానికి మించి అవకాశముందని అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుత మోడళ్లతో ప్రమాదం తక్కువేనని, భయమంతా స్వయంగా తన సామర్థ్యాన్ని పెంచుకునే భవిష్యత్ సూపర్‌ఇంటెలిజెన్స్ గురించేనన్నది హబింగర్ మాట. ఓపెన్‌ఏఐ అధినేత సామ్ ఆల్ట్‌మన్ కూడా ఈ స్థాయి ప్రమాదం "ఆమోదయోగ్యం కాదు" అన్నారు. ఈ ఏడాది ఐపీఓకు వెళ్లబోమని ప్రకటించారు. మరోవైపు, వాస్తవ ఖర్చుల లెక్కలు వేరే కథ చెబుతున్నాయి. మైక్రోసాఫ్ట్, ఆల్ఫాబెట్, అమెజాన్, మెటా, ఒరాకిల్ అనే ఐదు పెద్ద సంస్థలు 2026లో దాదాపు 660 నుంచి 690 బిలియన్ డాలర్లు మూలధన వ్యయంగా పెడతామని ప్రకటించాయి. అది గత ఏడాదికి దాదాపు రెట్టింపు. ఇందులో మూడొంతులు ఏఐ మౌలిక సదుపాయాలకే వెళ్తోంది. ఇంత వేగం ఇంటర్నెట్ కాలంలో కానీ, క్లౌడ్ విస్తరణ కాలంలో కానీ కనిపించలేదన్నది విశ్లేషకుల మాట. కొన్ని సంస్థలు ఈ ఖర్చుకు అప్పులపై ఆధారపడటమే అసలు ప్రశ్నగా కనిపిస్తోంది. ఇది వ్యాపార వ్యూహమా, లేక తప్పించుకోలేని పరిస్థితా? ప్రపంచ విశ్లేషకుల్లో ఈ విషయంలో స్పష్టమైన రెండు శిబిరాలు కనిపిస్తున్నాయి. ఈ రెండిటి వాదనలనూ నిష్పక్షపాతంగా చూడటం సరైన పద్ధతి.

మొదటి శిబిరం ఇది వ్యూహమేనంటుంది. వారి వాదన ప్రకారం, ఒక ఉత్పత్తి మనల్ని నాశనం చేయగలదని చెప్పడం, అది ఎంత శక్తిమంతమో చాటుకోవడానికి ఉత్తమ మార్గం. గూగుల్ బ్రెయిన్ సహ స్థాపకుడు ఆండ్రూ ఎన్‌జీ చాలా కాలంగా ఇదే చెబుతున్నారు. కొన్ని సంస్థలు నిధుల సేకరణ కోసం హైప్ సృష్టించాయని, "ఏఐ అందరి ఉద్యోగాలూ తీసేస్తుంది" వంటి కథనాలు ప్రజల అవగాహనను వక్రీకరించాయని అంటారు. ఎన్విడియా అధినేత జెన్సెన్ హువాంగ్ ఇంకో కోణం చెప్పారు, కంపెనీలే ప్రభుత్వాల వద్దకు వెళ్లి మరిన్ని నియంత్రణలు కోరడం "రెగ్యులేటరీ క్యాప్చర్" అవుతుందని, ప్రమాద భయం పెట్టుబడులను అడ్డుకుంటోందని. ఈ విమర్శకుల లెక్కలో మూడు ప్రయోజనాలు కనిపిస్తాయి. మొదటిది, "ఇది యుగాన్ని మార్చే సాంకేతికత" అనే కథ బతికి ఉంటే కొత్త నిధులు, ఐపీఓ అవకాశాలు సులువవుతాయి. రెండవది, నిబంధనల రూపకల్పనలో పెద్ద సంస్థలకే పెద్ద పాత్ర దక్కితే, చిన్న పోటీదారులు ఆ గోడను దాటలేరు. మూడవది, ఏదైనా తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదో నిర్ణయించే చట్రాన్ని ముందే తమకు అనుకూలంగా మలుచుకోవచ్చు. "భయం వారి అమ్మకపు సరుకే"నని వాదించే కథనాలు కూడా ఇప్పుడు వస్తున్నాయి. ఆర్థిక వైపునుంచి చూసినా ఈ అనుమానాలకు ఆధారం ఉంది. ఒక అంచనా ప్రకారం 2025లో ఏఐ సేవల ద్వారా వచ్చిన ఆదాయం పెట్టిన మౌలిక వ్యయంలో పదో వంతు మాత్రమే. మూలధన వ్యయం ఆదాయ వృద్ధి కన్నా చాలా వేగంగా పెరుగుతోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. 1998-2001 నాటి ఫైబర్ ఆప్టిక్ బుడగను గుర్తు చేస్తున్నారు. ఇటీవలి మదుపరుల సర్వేలో కూడా, ఏఐవల్ల లాభాలు వస్తున్నాయని అంగీకరించిన వారిలో చాలామంది, పెడుతున్న డబ్బుకు తగిన ప్రతిఫలం రావడం లేదనీ అన్నారు. అంటే ప్రమాదం గురించి చేసే ప్రకటనలు, భారీ పెట్టుబడులకు సమర్థన ఇచ్చే ఒక కథనంగా కూడా పనిచేస్తున్నాయని విమర్శకుల వాదన.

రెండవ శిబిరం మాత్రం, ఇదంతా కేవలం మార్కెటింగ్ అని కొట్టిపారేయడం సరికాదంటుంది. ఈ వాదనలో అసలు సమస్య భయమూ కాదు, లాభమూ కాదు, పోటీ అనే ఉచ్చు! జాకబ్ కాక్సన్ వివరణ ఇదే. ప్రమాదాన్ని బాగా అర్థం చేసుకున్న సంస్థ కూడా, మరొకరు బాధ్యతారహితంగా ముందుకు వెళ్లి గెలుస్తారన్న భయంతో తానూ పరుగెత్తాల్సి వస్తోంది. గూగుల్ డీప్‌మైండ్ అధినేత డెమిస్ హసాబిస్ కూడా ఈ "రేస్ కండిషన్స్" ప్రమాదం గురించి హెచ్చరించారు. ఈ ఏడాది మార్చిలో యాంత్రోపిక్ తన భద్రతా నియమాల్లో కొన్నింటిని సడలించిందనే వార్తలు, పోటీ ఒత్తిడి ఎంత బలంగా ఉందో చూపాయి. భద్రతపై గట్టిగా మాట్లాడిన సంస్థలే చివరికి పోటీ ముందు తలవంచాయని మ్యాక్స్ టెగ్‌మార్క్ వంటి విమర్శకులు అన్నారు. ఒక కంపెనీ ఆగితే మరొకటి ఆ స్థానాన్ని భర్తీ చేస్తుందన్న భావన బలంగా ఉంది. దానికి దేశాల మధ్య పోటీ కూడా తోడైంది. అమెరికా ప్రభుత్వం ప్రధానంగా గెలవడంపైనే దృష్టి పెట్టిందని, అంతర్జాతీయ సమన్వయం లేనిదే ఒకరు ఆగినా లాభం లేదని విశ్లేషకులు అంటున్నారు. మరో ఆందోళనకర అంశం, కొన్ని సంస్థలు తమ మోడళ్ల పరీక్షల సమయంలో నియంత్రణ దాటి బయటి వ్యవస్థల్లోకి చొరబడిన ఘటనలను అంగీకరించడం. అంటే భయం పూర్తిగా కల్పితం కాదు. అయినా నిజం ఏమిటంటే, ఈ రెండు వాదనలూ ఒకదానికొకటి వ్యతిరేకం కావు. ఒకే సంస్థ ఒకేసారి ప్రమాదాన్ని నిజంగా నమ్మవచ్చు, ఆ భయాన్ని వ్యాపారానికి వాడుకోనూవచ్చు. కాబట్టి అసలు ప్రశ్న ఎవరు నిజాయతీపరులు అన్నది కాదు. ఇంతటి శక్తిని, ఇంత పెద్ద పందెంలో, కొద్ది ప్రైవేట్ సంస్థల నిర్ణయాలకే వదిలేయడం ఎంతవరకు సమంజసం అన్నదే. ఈ సంస్థలే నిబంధనలు రాయడం, పరీక్షలు జరపడం, లాభం పొందడం, అన్నీ చేస్తున్నాయి. ఇలాంటి విషయాల్లో స్వతంత్ర పర్యవేక్షణ, పారదర్శకమైన ప్రమాద నివేదికలు, అంతర్జాతీయ ఒప్పందాలు తప్పనిసరి. ఇందుకు స్వచ్ఛంద హామీలు చాలవు; ఆ వాగ్దానాలే చట్టాలుగా మారాలి. అప్పటివరకు భయం, పెట్టుబడి ఒకే నాణేనికి రెండు వైపులుగా నడుస్తూనే ఉంటాయి. ఆ నాణెం ఎటు పడుతుందో మనకు తెలియదు కాబట్టే, దాన్ని ఎగరేసే చేతులపై నిఘా అవసరం. ఏఐ మన భవిష్యత్తుకు దీపమవుతుందో, కాల్చే నిప్పవుతుందో నిర్ణయించేది దాన్ని నడిపే మనుషుల విజ్ఞతే. ఆ నిర్ణయం కొద్దిమంది బోర్డు రూముల్లో కాక, ప్రజాస్వామ్య చట్టాల వెలుగులో జరిగిననాడే ఈ పందెం.. మానవాళికి గెలుపవుతుంది!!

---

## పనికొచ్చే పలుకు



# వాళ్ల సలహాలే.. నీ జీవితమా!

రాత్రి పదకొండు. ఫోన్ చేతిలో, స్క్రోలింగ్ ఆగదు. ఒకడు "5ఏఎం క్లబ్‌లో చేరకపోతే నువ్వు లూజర్" అంటాడు. ఇంకొకడు "30 ఏళ్లలోపు కోటి సంపాదించకపోతే వేస్ట్" అంటాడు. మరొకరు నీ పోస్ట్‌కు కామెంట్ పెడతారు: "ఇంకా ఇదేనా నీ లెవెల్?" ఒక్క గంటలో నువ్వు ముగ్గురి తీర్పులు మోసి, ముగ్గురికీ సరిపోని మనిషిగా నిద్రపోతావు. ఇక్కడ ఆగి ఒక విషయం ఆలోచిద్దాం. ఈ తీర్పులన్నీ నిజంగా నీ గురించేనా?

విమర్శ అద్దం కాదు, ఫిల్టర్

ఎవరైనా నీ గురించి ఒక మాట అన్నప్పుడు, అది నీ నిజమైన ప్రతిబింబం కాదు. అది వాళ్ల కళ్లద్దాల రంగు. రోజూ ఆలస్యంగా లేచే వ్యక్తి "ఉదయం లేవడం వేస్ట్" అంటాడు, తన అపరాధ భావాన్ని కప్పిపుచ్చుకోవడానికి. ఇతరులు చేసే పనిలో తప్పులు వెతికేవాడు, సాధారణంగా తన పని చేయడానికి భయపడుతున్నవాడే. చాలా విమర్శల వెనుక ఉండేది నీ లోపం కాదు, వాళ్ల స్వీయ సందేహం, అభద్రత. నీ ఎదుగుదల వాళ్లకు తాము ఆగిపోయిన చోటును గుర్తు చేస్తుంది. అది బాధిస్తుంది కాబట్టి నిన్ను కిందకు లాగాలనుకుంటారు.

మూడు ఫిల్టర్ ప్రశ్నలు

ఏ మాట విన్నా, మనసులోకి పంపే ముందు ఇవి అడుగు.

ఈ మాట ఎక్కడి నుంచి వస్తోంది? నువ్వు వెళ్లాలనుకునే దారిలో ఇప్పటికే నడిచినవాళ్ల సలహా, బంగారం. ఆ దారి చూడనివాళ్ల తీర్పు, కేవలం శబ్దం.

ఇది ఎందుకు చెబుతున్నారు? నిజంగా నీ మంచి కోసమా, లేక తమ అభద్రతను దించుకోవడానికా, లేక వ్యూస్, లైక్స్ కోసమా? ఉద్దేశం మాటకంటే ముఖ్యం.

ఇందులో పని చేసే నిజం ఉందా? ఇదే అసలు పరీక్ష. చెప్పినవాడు నీకు నచ్చకపోయినా, మాటలో నిజం ఉంటే తీసుకో. ఎంత ఇష్టమైనవాడు చెప్పినా, నిజం లేకపోతే వదిలేయి. మనిషిని కాదు, మాటను జల్లెడ పట్టు.

లైఫ్‌స్టయిల్ మార్పు ఇక్కడే మొదలవుతుంది

చాలామంది జీవనశైలి మార్చుకోలేకపోవడానికి కారణం బద్ధకం కాదు, ఇతరుల అంచనాల బరువు. "ఇన్‌స్టాలో బాగా కనిపించాలి" అని బతికేవాడు, నిజంగా సుఖంగా ఉండే జీవితం ఎన్నడూ ట్రై చేయడు. కాబట్టి మార్పును ప్రదర్శన కోసం కాకుండా, నీ కోసం మొదలుపెట్టు.

ఈ చిన్న అలవాట్లు ప్రయత్నించు:

నిద్రకు ఫోన్ లేకుండా అరగంట. స్క్రీన్ దూరం పెడితే, తీర్పుల శబ్దం తగ్గుతుంది.

రోజుకు ఒక నడక. ఇయర్‌ఫోన్స్ లేకుండా పది నిమిషాలు. నీ ఆలోచనలు నీకే వినిపిస్తాయి.

వారానికి ఒక "మ్యూట్ డే". నీకు "సరిపోవు" అనిపించే అకౌంట్లను మ్యూట్ చేయి. అన్‌ఫాలో చేయాల్సిన పని కూడా లేదు, కొంత దూరం చాలు.

నీకు నువ్వే చెక్ ఇన్. రోజు చివర్లో ఒక్కటే అడుగు: "ఈ రోజు నేను నాకు నచ్చినట్టు బతికానా?"

ఒక గుర్తుంచుకోవాల్సిన మాట

ప్రపంచంలో అందరినీ మెప్పించిన మనిషి ఎవరూ లేరు. కానీ తమ మాటకు నిలబడి తమ జీవితాన్ని మార్చుకున్నవాళ్లు ఎందరో ఉన్నారు. విమర్శను పూర్తిగా వద్దనకు, పూర్తిగా మోయకు. జల్లెడ పట్టి, నిజాన్ని ఉంచుకుని, శబ్దాన్ని వదిలేయి. ఎందుకంటే నీ జీవితపు స్క్రిప్ట్‌కు ఎడిటర్ నువ్వే. కామెంట్ సెక్షన్ కాదు, గుర్తుంచుకో.

---

# పారిస్ నుంచి లిమోజ్ వరకు..!




ఫ్రాన్స్ ఇప్పుడు ఒక చేదు వాస్తవాన్ని ఎదుర్కొంటోంది. శాంతియుతంగా మొదలైన ప్రజాందోళన, చూస్తుండగానే హింస, దహనం, దోపిడీలుగా మారింది. అక్టోబర్ 17, శనివారం దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 5.5 లక్షలమంది పాల్గొన్నారు. అందులో పారిస్‌లోనే 1.1 లక్షలమంది ఉన్నారు. నిర్వాహకులైన కార్మిక సంఘాలు ఈ సంఖ్య 8 లక్షల వరకూ ఉందంటున్నాయి. పగటిపూట ర్యాలీలు ప్రశాంతంగానే సాగాయి. కానీ సాయంత్రానికి నల్లటి దుస్తులు వేసుకుని, ముఖాలకు మాస్కులు ధరించిన గుంపులు రంగంలోకి దిగడంతో పరిస్థితి అదుపు తప్పింది. పారిస్, మార్సెయ్, లియాన్, లిల్లే, బోర్డో, రెన్నెస్, గ్రెనోబుల్, నీస్, లిమోజ్‌వంటి నగరాల్లో కార్లు కాలిపోయాయి, దుకాణాల అద్దాలు పగిలాయి, వందలాది వ్యాపార సంస్థలు దోపిడీకి గురయ్యాయి. అన్నింటికన్నా ఎక్కువగా దేశాన్ని కలచివేసింది లిమోజ్‌లో 143 ఏళ్ల చరిత్ర ఉన్న నగరపాలక సంస్థ భవనం దగ్ధం కావడం. మంటల్లో పైకప్పు కూలిపోయి, భవనం దాదాపు పూర్తిగా ధ్వంసమైంది. అది ఉద్దేశపూర్వకంగా పెట్టిన నిప్పేనని స్థానిక ప్రిఫెక్ట్ స్పష్టం చేశారు. లియాన్‌లో పర్యాటక సమాచార కేంద్రం మంటల్లో చిక్కుకుంది. మార్సెయ్‌లో సిటీ హాల్‌లోకి నిరసనకారులు చొరబడ్డారు. అధికారిక సమాచారం ప్రకారం కనీసం 1,800 మందిని అరెస్టు చేశారు. ఒక్క పారిస్‌లోనే రికార్డు స్థాయిలో 855 అరెస్టులు జరిగాయి, వారిలో దాదాపు మూడోవంతు మైనర్లు కావడం ఆందోళన కలిగించే విషయం. 500 మందికి పైగా పోలీసులు, జెండార్మ్‌లు, అగ్నిమాపక సిబ్బంది గాయపడినట్టు అంతర్గత వ్యవహారాల మంత్రి లారెంట్ న్యూనెజ్ తెలిపారు. పారిస్‌లో ఒక నిరసనకారుడు గుండె ఆగి మరణించగా, సెయింట్-ఎటియెన్‌లో చిన్న పేలుడు పదార్థం పేలి ఒక యువకుడు చేతిని కోల్పోయాడు. సుమారు 1,500 దుకాణాలు, వ్యాపార సంస్థలు దెబ్బతిన్నాయని రిటైల్ సమాఖ్య వెల్లడించింది. ఒక్క క్యారీఫోర్ సంస్థకే 50కి పైగా స్టోర్లకు నష్టం జరిగి, అనేక మిలియన్ యూరోలమేర నష్టం వాటిల్లిందని దాని సీఈఓ అంచనా వేశారు. మరుసటి రోజు ఉదయం దుకాణదారులు చీపుర్లతో రోడ్లపైకి వచ్చి గాజు ముక్కలు తొలగించారు. గోడలపై "ధనవంతులపై పన్నులు పెంచండి" వంటి నినాదాలు కనిపించాయి. "ఇక్కడ యుద్ధం జరిగినట్టుగా ఉంది" అని ఒక పారిస్ వాసి అన్న మాటే ఆ దృశ్యాలను ఒక్క వాక్యంలో చెబుతోంది. దోపిడీకి గురైన ఒక దుకాణ యజమాని మాటలు మరింత ఆలోచింపజేస్తాయి. తమ దుకాణాన్ని దోచుకున్నవారు పాఠశాలల గురించో, జీవన వ్యయం గురించో ఆందోళన చెందే నిరసనకారులు కాదని, ఆ గందరగోళాన్ని అవకాశంగా తీసుకున్న దొంగలన్నారు.

ఈ ఆగ్రహం ఒక్కరోజులో పుట్టింది కాదు. దీని మూలాలు పాఠశాల తరగతి గదుల్లో ఉన్నాయి. సెప్టెంబర్ 21న పారిస్ శివారులోని పేద ప్రాంతాల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల నిరసనగా ఇది మొదలైంది. ఉపాధ్యాయుల కొరత, కిక్కిరిసిన తరగతులు, శిథిలావస్థలో ఉన్న భవనాలు విద్యార్థుల ప్రధాన ఫిర్యాదులు. పాఠశాలలకు 10 బిలియన్ యూరోలు కేటాయించాలని, విశ్వవిద్యాలయ ప్రవేశాల వ్యవస్థ అయిన "పార్కోర్సప్"ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అక్టోబర్ 6న దాదాపు 800 ఉన్నత పాఠశాలలు మూతపడ్డాయి. అక్టోబర్ 13న సుమారు 4.8 లక్షల మంది వీధుల్లోకి వచ్చారు. ప్రభుత్వం 3,000 మంది అదనపు ఉపాధ్యాయులను పంపుతామని ప్రకటించింది. పోలీసులు స్టన్ గ్రెనేడ్ల వాడకాన్ని నిలిపివేశారు. కానీ ప్రధాని సెబాస్టియన్ లెకోర్ను విద్యా బడ్జెట్‌ను భారీగా పెంచే డిమాండ్‌ను తోసిపుచ్చారు. 2027 బడ్జెట్‌లో విద్యకు అదనంగా 1.2 బిలియన్ యూరోలు ఇస్తున్నామని చెప్పారు. ఇక్కడే అసలు చిక్కు ఉంది. ఫ్రాన్స్ జాతీయ రుణం 1946 తర్వాత అత్యధిక స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పదుల బిలియన్ల యూరోల పొదుపు చర్యలతో కూడిన కఠిన బడ్జెట్‌ను సిద్ధం చేస్తోంది. అంటే ఒకవైపు ప్రజలు ఎక్కువ ఖర్చు చేయమని అడుగుతున్నారు, మరోవైపు ఖజానా ఖర్చు తగ్గించమని చెబుతోంది. దీనికి జీవన వ్యయ భారం తోడైంది. మధ్యప్రాచ్య యుద్ధం వల్ల యూరప్‌లో ద్రవ్యోల్బణం పెరిగి, ఇంధన ధరలు ఆకాశాన్ని తాకాయి. ఈ అసంతృప్తిని అందిపుచ్చుకుని, 2018-19లో ఇంధన పన్నులకు వ్యతిరేకంగా ఉద్యమించిన "ఎల్లో వెస్ట్" ఉద్యమం విద్యార్థులతో చేతులు కలిపింది. కార్మిక సంఘాలు, రైతులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు కూడా చేరారు. శనివారం జనసంఖ్య ఎల్లో వెస్ట్ ఉద్యమ గరిష్ఠ స్థాయిని దాటింది. అయితే 2023 పెన్షన్ సంస్కరణ వ్యతిరేక నిరసనల స్థాయికి మాత్రం చేరలేదు. ఆ ప్రభావం బెల్జియం, ఇటలీ, పోర్చుగల్ వంటి పొరుగు దేశాలకూ విస్తరించింది. బ్రస్సెల్స్‌లో యువత పోలీసులతో ఘర్షణ పడింది.

ఇప్పుడు అందరి కళ్లూ ప్రభుత్వ స్పందనపైనే ఉన్నాయి. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఆదివారం దేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల "న్యాయమైన డిమాండ్లు", విధ్వంసం, దోపిడీకి పాల్పడినవారి చర్యల మధ్య స్పష్టమైన గీత గీశారు. హింసకు ఎలాంటి సమర్థనా లేదని, బాధ్యులను శిక్షిస్తామని, నష్టపోయిన వ్యాపారాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రధాని లెకోర్ను "మేము బెదిరిపోం" అని ప్రకటించి, హింసకు "అతివాద వామపక్ష" గ్రూపులను బాధ్యులను చేశారు. నష్టపరిహారం, బీమా, నిందితులపై న్యాయ చర్యల కోసం అత్యవసర మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. న్యాయ మంత్రి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రాసిక్యూటర్లను ఆదేశించారు. మరోవైపు పారిస్, మార్సెయ్, లియాన్ మేయర్లు పోలీసు బలగాల కేటాయింపుపై ప్రభుత్వాన్ని వివరణ కోరారు. ప్రతిపక్షాలు కూడా ఊరుకోలేదు. వామపక్ష నేత జీన్-లూక్ మెలెంచోన్ దోపిడీని ఖండిస్తూనే, ప్రభుత్వం పరిస్థితిని నిర్వహించిన తీరును విమర్శించారు. అధ్యక్ష ఎన్నికల్లో ముందంజలో ఉన్న మరీన్ లె పెన్ "అల్లరిమూకలు ప్రజల కొనుగోలు శక్తి కోసం చేసే ఉద్యమాన్ని విషపూరితం చేశాయి" అన్నారు. ఆరు నెలల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో ప్రతి పార్టీ ఈ సంక్షోభాన్ని రాజకీయ కోణంలోనే చూస్తోందనేది స్పష్టం.

సామాన్య ప్రజల దృష్టిలో విషయం సరళమైనది. ఆగ్రహానికి కారణమైన సమస్యలు నిజమైనవే, కానీ ఆ పేరుతో జరిగిన విధ్వంసం సమర్థనీయం కాదు. చరిత్రాత్మక భవనాలు కాలిపోయాయి, చిన్న వ్యాపారులు రోడ్డున పడ్డారు, లక్షలాది మంది శాంతియుతంగా వినిపించిన గొంతు కాలిన కార్లు, పగిలిన అద్దాల శబ్దంలో కలిసిపోయింది. హింస ఎప్పుడూ ఉద్యమం బలాన్ని తగ్గిస్తుంది, ప్రభుత్వానికి కఠిన చర్యలకు సాకు ఇస్తుంది. అదే సమయంలో ప్రజల ఆందోళనను కేవలం "శాంతిభద్రతల సమస్య"గా చూడటం కూడా పాలకులు చేసే తప్పే అవుతుంది. ఖజానా క్రమశిక్షణ ఎంత అవసరమో, బడి భవనాలు, ఉపాధ్యాయులు, ఇంధన ధరల వంటి ప్రజల రోజువారీ అవసరాలు కూడా అంతే ముఖ్యం. చర్చల బల్లపై సమాధానం వెతికే సంకల్పం ప్రభుత్వానికి, హింసను దూరం పెట్టే విజ్ఞత ఉద్యమకారులకు ఉంటేనే ఫ్రాన్స్ ఈ సంక్షోభం నుంచి బయటపడుతుంది. ఈ పరిణామం ప్రజాస్వామ్య దేశాలన్నిటికీ ఒక హెచ్చరిక కూడా! ■

---



మెదడు ఒక ఫోన్ లాంటిది. వంద యాప్‌లు ఒకేసారి తెరిచి ఉంటే, ఎంత ఛార్జ్ పెట్టినా అది వేడెక్కి, నెమ్మదిస్తుంది. అప్పుడు మరింత నొక్కితే వేగం పెరగదు, హ్యాంగ్ అవుతుంది. కాబట్టి కొన్నిసార్లు చేయాల్సింది పరుగు కాదు, పాజ్. పనులను పక్కన పెట్టు, లోతుగా ఊపిరి పీల్చు, కాసేపు ఏమీ చేయకుండా కూర్చో. ఆ ఖాళీలోనే అలసిన మనసు రీస్టార్ట్ అవుతుంది. చెల్లాచెదురైన ఆలోచనలు ఒక్కచోట చేరతాయి. క్రమశిక్షణ ముఖ్యమే, కానీ అలసిన మనసుకు విశ్రాంతే మందు.

-మహాదేవ

---

## వింతల్లో వింతలు

# టెక్సాస్‌లో టోపీ... కాదు, టోపీ పేరిట బార్!




"టెక్సాస్‌లో అన్నీ పెద్దవే" అనే సామెతను అమెరికా ఈసారి అక్షరాలా నిరూపించింది. ఆస్టిన్‌లోని సర్క్యూట్ ఆఫ్ ది అమెరికాస్ రేస్ ట్రాక్‌లో, టెకోవాస్ సంస్థతో కలిసి నాలుగేళ్లు కష్టపడి ప్రపంచంలోనే అతిపెద్ద కౌబాయ్ టోపీని నిలబెట్టారు. ఫైబర్‌గ్లాస్, ఫోమ్, ఉక్కు చట్రంతో చేసిన ఈ టోపీ 43 అడుగుల వెడల్పు, 47 అడుగుల పొడవు, 17 అడుగుల ఎత్తు! గిన్నిస్ రికార్డు కూడా దక్కింది. అసలు మజా ఏమిటంటే, టోపీ కింద పూర్తిస్థాయి బార్ ఉంది. అంటే రేసు చూడటానికి వెళ్లినవాళ్లు ఎండకు తలదాచుకుంటారు, బయటకు వచ్చేసరికి తల తిరుగుతుంది!

# మూడో షెడ్యూల్‌కు కార్తీ-కళ్యాణ్ సినిమా



కోలీవుడ్ టాలెంటెడ్ హీరో కార్తీ నటించిన "సర్దార్-2" ఇటీవల విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ నిరాశ మిగిల్చింది. అదే సమయంలో ఆయన అన్నయ్య సూర్య మళ్లీ ఫామ్‌లోకి రావడమే కాకుండా, తెలుగు దర్శకులతో కలిసి సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు. ఇప్పుడు అదేబాటలో కార్తీ కూడా ఒక తెలుగు దర్శకుడితో కొత్త ప్రాజెక్టు ప్రారంభించారు. "మ్యాడ్" సిరీస్‌తో వరుస విజయాలు అందుకున్న యువ దర్శకుడు కళ్యాణ్ శంకర్ ఈ చిత్రానికి దర్శకుడు. ఇటీవలే అధికారికంగా ప్రకటించిన ఈ ఎంటర్‌టైనర్‌కు సంబంధించి ఇప్పుడు ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. ఎలాంటి హడావుడి, ప్రచారం లేకుండానే చిత్ర యూనిట్ షూటింగ్‌ను వేగంగా పూర్తి చేస్తోందని సమాచారం. ఇప్పటికే రెండు షెడ్యూల్స్‌ను విజయవంతంగా ముగించిన దర్శకుడు, ఇప్పుడు మూడో షెడ్యూల్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయిక. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. కళ్యాణ్ శంకర్ మార్క్ వినోదం, కార్తీ నటన కలిస్తే ప్రేక్షకులకు మంచి ఎంటర్‌టైనర్ ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. "సర్దార్ 2" నిరాశ తర్వాత కార్తీకి ఈ సినిమా ఒక సరైన కమ్‌బ్యాక్ అవుతుందేమో చూడాలి. ప్రస్తుతం షూటింగ్ వేగంగా సాగుతుండటంతో, త్వరలోనే సినిమాకు సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్‌వంటి అప్‌డేట్స్ వచ్చే అవకాశముంది. ఈ చిత్రంపై తెలుగు, తమిళ ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

## హాట్ స్టార్!


మిర్నా మీనన్

# కేరళ సీఎంను మెప్పించిన మమితా బైజు సినిమా



దక్షిణాది సినిమా రంగంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న యంగ్ హీరోయిన్ మమితా బైజు. నేటితరం యువతను తనవైపు తిప్పుకున్న ఈ నటి నుంచి ఇటీవల వచ్చిన సంచలన హిట్ "బెత్లెహెం కుదుంబా యూనిట్". మలయాళ నటుడు నివిన్ పౌలి హీరోగా, "ప్రేమలు" ఫేమ్ గిరీష్ ఎడి దర్శకత్వంలో రూపొందిన రొమాంటిక్ కామెడీ, అక్కడ రికార్డులు తిరగరాసి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ఇటీవలే ఓటీటీలోకి వచ్చిన ఈ సినిమాకు, ఇక్కడా ప్రేక్షకులనుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. తాజాగా ఈ చిత్రం హవా ఏకంగా కేరళ ముఖ్యమంత్రి వి.డి. సతీషన్ వరకు చేరింది. సినిమా చూసిన ఆయన ప్రశంసల జల్లు కురిపించారు. చాలాకాలం తర్వాత ఒక మంచి సినిమా చూశానని సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాదు, సినిమా అప్పుడే అయిపోయిందా అనిపించేంత బాగా ఆకట్టుకుందని చెబుతూ, చిత్ర యూనిట్ మొత్తానికి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన షేర్ చేసిన ఒక ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో ఒక బుక్ షెల్ఫ్‌లో పుస్తకాలు ఉండగా, వాటి మధ్య నివిన్, మమితా బైజు పేర్లతో పాటు సినిమా టైటిల్‌తో ఉన్న పుస్తకాన్ని కూడా పెట్టి, ఎంతో వినూత్నంగా పోస్ట్ చేశారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రినే ఇంతగా మెప్పించిందంటే, ఈ సినిమా కంటెంట్ ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చని నెటిజన్లు అంటున్నారు. ఓటీటీలో కూడా ఈ చిత్రం అదే జోరు కొనసాగిస్తోంది. మమితా బైజు కెరీర్‌లో ఇది మరో మైలురాయిగా నిలిచిందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

# 'ది ప్రాంప్ట్ వార్ -రైజ్ ఆఫ్ మహావీర్': పురాణం, ఏఐ కలయికతో కొత్త సినిమా

భారతీయ పురాణాలు, అంతుచిక్కని రహస్యాలు, ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీ కలగలిపిన సరికొత్త సినిమాటిక్ ప్రపంచాన్ని ఆవిష్కరించేందుకు "ఆర్విహా క్రియేషన్స్" సిద్ధమవుతోంది. ఈ సంస్థ తన తొలి చిత్రంగా "ది ప్రాంప్ట్ వార్ -రైజ్ ఆఫ్ మహావీర్" టైటిల్‌ను దసరా పండుగ సందర్భంగా అధికారికంగా ప్రకటించింది. నరేష్ గౌడ్ నిర్మాతగా, నూతన దర్శకుడు ప్రసన్న కొత్వాల దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది.

ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కథా ప్రపంచంతో తెరకెక్కుతుండటం టాలీవుడ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పురాణ గాథలను ఆధునిక సాంకేతికతతో మేళవించి, ప్రేక్షకులకు విజువల్ వండర్ అందించాలన్నదే చిత్ర యూనిట్ లక్ష్యం. "రైజ్ ఆఫ్ మహావీర్" అనే ఉపశీర్షిక కథలోని కీలక పాత్రపై, దాని వెనుక దాగి ఉన్న రహస్యాలపై ఉత్కంఠను పెంచుతోంది. ఈ చిత్రంతో జి.సి.శేఖర్ సంగీత దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తూ, వినూత్న కథాంశంతో ముందుకు రావడం విశేషం. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో, 3డీ వెర్షన్‌లో సినిమా రూపొందుతోంది. 2027 వేసవిలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. పురాణం, సైన్స్ ఫిక్షన్ కలయికగా వస్తున్న ఈ ప్రయోగాత్మక చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే నటీనటుల వివరాలు, ఇతర అప్‌డేట్స్ వెల్లడించే అవకాశం ఉంది.



# రెహమాన్ ట్యూన్‌కు దేవిశ్రీ గొంతు




పాన్ ఇండియా ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రాల్లో "రామాయణ" ఒకటి. దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న ఈ ఎపిక్ సినిమాలో రణబీర్ కపూర్, సాయిపల్లవి, యష్ వంటి అగ్ర తారలు నటిస్తున్నారు. బిగ్ స్క్రీన్‌పై ప్రేక్షకులకు గొప్ప విజువల్ ట్రీట్ ఇవ్వనున్న ఈ చిత్రం నుంచి తాజాగా మేకర్స్ రెండో పాట విడుదల చేశారు. ఈసారి రావణాసురుడి పాత్రపై ఈ పాటను రూపొందించారు. "రావణ తాండవం" పేరుతో పాన్ ఇండియా భాషల్లో విడుదలైన ఈ పాటను సంగీత మాంత్రికుడు ఏఆర్ రెహమాన్ అద్భుతంగా స్వరపరిచారు. తెలుగు వెర్షన్‌ను టాలీవుడ్ టాప్ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్‌తో పాడించడం విశేషం. పాట విడుదలైన తర్వాత అన్ని భాషల వెర్షన్లతో పోలిస్తే, తెలుగులోనే మరింత ఇంటెన్సిటీతో వినిపిస్తోందని శ్రోతలు అంటున్నారు. దేవిశ్రీ తనదైన గొంతుతో ఈ పాటను ఆ స్థాయిలో పాడటం ప్రధాన హైలైట్‌గా నిలిచింది.

ఈ పాటతో రెహమాన్ మరోసారి సిక్సర్ కొట్టారని చెప్పవచ్చు. ప్రస్తుతం విడుదల చేసిన పాట నిడివి తక్కువగానే ఉన్నప్పటికీ, సినిమాలో పూర్తి నిడివితో ఉండే అవకాశం ఉంది. రావణుడి పాత్రలో యష్ లుక్, ఆయన పవర్‌ఫుల్ ప్రెజెన్స్ ఈ పాటకు అదనపు బలాన్ని ఇచ్చాయి. ఇప్పటికే విడుదలైన అప్‌డేట్స్‌తో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ ఎపిక్ చిత్రం నవంబర్ 5న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.




# నయనతార 'మహాశక్తి' తెలుగు ట్రైలర్ రిలీజ్

లేడీ సూపర్‌స్టార్ నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న భారీ చిత్రం నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు "మహాశక్తి" టైటిల్‌ను అధికారికంగా ఖరారు చేశారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని, చిత్రానికి సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై డా. ఇషారి కె. గణేష్ ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. హిప్ హాప్ తమిళ సంగీతం అందిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న చిత్రంపై మొదటి నుంచే మంచి అంచనాలు ఉన్నాయి. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో నయనతార అత్యంత శక్తివంతమైన, పవర్‌ఫుల్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను కట్టిపడేశారు.

ఆమె లుక్, ఇంటెన్స్ ప్రెజెన్స్ ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అంతేకాదు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, హిప్ హాప్ తమిళా అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాపై అంచనాలను మరింత పెంచేలా ఉన్నాయి. సుందర్ సి ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్లతో మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు నయనతార వంటి స్టార్ హీరోయిన్‌తో ఒక భారీ ఫాంటసీ తరహా ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుండటంతో, ఈ సినిమా ఎలా ఉంటుందోనని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ట్రైలర్‌కు వస్తున్న స్పందన చూస్తే, సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని అందుకునే అవకాశం ఉందని అనిపిస్తోంది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.